PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 189 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- ఆదివారం 06 జులై 2025

## విద్యార్థి సంఘాల పేరుతో వసూళ్లకు వస్తే కేసులు పెట్టండి




## ఆర్టీసీలో ఆదర్శ ఉద్యోగులకు సన్మానం









## చిన్నారులపై లైంగిక దాడి కేసుల్లో

# కఠిన శిక్షలు

- సామాజిక మాధ్యమాల విషయంలో జాగ్రత్తలు
- లైంగిక వేధింపుల నుంచి పూర్తిస్థాయి రక్షణకు చర్యలు
- పిల్లలు, మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం
- లైంగిక దాడులపై సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,5 (పీసీడబ్ల్యూ న్యూస్):** చిన్నారులు, మహిళల భద్రతకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భరోసా కేంద్రాల ద్వారా బాధితులకు అండగా ఉంటున్నట్లు చెప్పారు. 'లైంగిక దాడుల బాధిత చిన్నారుల రక్షణ, భద్రత' అంశంపై హైదరాబాద్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. చిన్నారులపై లైంగిక హింసను అందరూ ఖండించాలన్నారు. ఇలాంటి కేసుల్లో నిందితులను కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సదస్సులో సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్, హైకోర్టు న్యాయమూర్తులు, డీజీపీ జితేందర్, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్టేట్ లెవెల్ స్టేక్ హోల్డర్స్ కన్సల్టేషన్ మీట్-2025 కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. వాయిస్ ఫర్ ది వాయిస్ లెస్ అనే థీమ్ తో.. తమ బాధను చెప్పుకోలేని వారికి రక్షణ కల్పించేందుకు ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి రాష్ట్రస్థాయి సమావేశం ఏర్పాటు చేయడం చాలా అవసరం అన్నారు. ఎంతో కీలకమైన అంశంపై సదస్సు నిర్వహిస్తున్న తెలంగాణ పోలీసు, ఇతర నిర్వాహకులను అభినందిస్తున్నా.. ఇలాంటి

మిగతావి 2లో

# ఎన్‌డిఎకు జాతి ప్రయోజనాలే ముఖ్యం

- ఏ దేశంతో అయినా ఒప్పందాల్లో ఇదే ప్రధానం
- కాంగ్రెస్ విమర్శలను తిప్పికొట్టిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్



**న్యూఢిల్లీ,జూలై 5 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఎన్డీఏ ప్రభుత్వానికి జాతీయ ప్రయోజనాలే మొదటి ప్రాధాన్యత అని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సుంకాల విషయంలో ప్రధాని ఓ నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం దేశ ప్రజల గురించి పట్టిం చుకోక పోవడం వల్ల

మిగతావి 2లో

# ట్రంప్ సుంకాలకు తలొగ్గుతారు చూడండి

- పీయూష్ గోయల్ వ్యాఖ్యలకు రాహుల్ కౌంటర్



**న్యూఢిల్లీ,జూలై 5 (పీసీడబ్ల్యూ న్యూస్):** ట్రంప్ సుంకాలకు ప్రధాని మోదీ తలొగ్గ తారని.. తన మాటలు నమ్మకపోతే రాసిపెట్టుకోవాలని విపక్షనేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. అమెరికాతో వాణిజ్య

మిగతావి 2లో

## అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన

# రామచంద్రరావు

- గజమాలతో సత్కరించిన బిజెపి అగ్రనేతలు
- బిజెపి విధానాలు నచ్చని వారు పార్టీని వీడినా నష్టం లేదు
- మీడియా సమావేశంలో కొత్త అధ్యక్షుడి స్పష్టీకరణ



**హైదరాబాద్,5 (పీసీడబ్ల్యూ న్యూస్):** భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్.రామచందర్ రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కాషాయ నేతలు ఆయన్ను గజమా లతో సత్కరించారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలను రామచందర్ రావుకు కిషన్ రెడ్డి అప్పగించారు. ఈ సందర్భంగా కొత్త అధ్యక్షుడికి బీజేపీ శ్రేణులు అభినందనలు తెలిపారు. బాధ్యతల స్వీకరణ అనంతరం రామచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ.. సామాన్య కార్యకర్త స్థాయి నుంచి అధ్యక్షుడి వరకు రావడం

మిగతావి 2లో



## ఆస్పత్రి నుంచి కెసిఆర్ డిశ్చార్జ్

## మంత్రి సీతక్కకు వచ్చిన మావోల లేఖ ఫేక్



# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

- అద్దె బస్సులు అందించిన మహిళా సంఘాలకు చెక్కులు
- ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భట్టి



**హైదరాబాద్,5 (పీసీడబ్ల్యూ న్యూస్):** అవకాశం ఉన్న ప్రతిచోట మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తమ ప్రభుత్వం మహిళా సంఘాలకు అండగా ఉంటుందని చెప్పారు. ప్రజాభవన్‌లో ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. ఆర్టీసీకి అద్దె బస్సులు అందించిన మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. తొలి నెల అద్దె కింద రూ. 1.49 కోట్లు- ఆయా సంఘాలకు.. మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, సీతక్క అందించారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహిళలు వ్యాపార వేత్తలుగా రాణించేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే

మిగతావి 2లో




# శ్రీకృష్ణనగర్ బస్తీలో మురుగునీరు పారకం

- మున్సిపల్ అధికారుల తీరుపై కేంద్రమంత్రి ఆగ్రహం

**హైదరాబాద్,5 (పీసీడబ్ల్యూ న్యూస్):** కాలనీల్లో మురుగునీరు ప్రవహిస్తున్నా చర్యలు తీసుకోరా అంటూ.. మున్సిపల్ అధికారులపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇంటిముందు ఇలా ఉంటే ఎలా ఉంటుందో

మిగతావి 2లో

## వ్యవసాయంపై ఎక్కడ చర్చ పెట్టినా

# సిద్ధమే...

- సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 8న సిద్ధంగా ఉంటా
- ఎవరు రైతులకు మేలు చేశారో...చేయలేదో తేలుస్తాం
- ఈ చర్చకు కేసీఆర్ అవసరం లేదు...నేను చాలు
- మీడియా సమావేశంలో రేవంత్‌కు కెటిఆర్ సవాల్



## స్టాంప్ సవరణ చట్టం కోసం

# కసరత్తు

- అసెంబ్లీలో సవరణకు నిర్ణయం
- అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి



**హైదరాబాద్,జూలై 5 (పీసీడబ్ల్యూ న్యూస్):** రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా సాధారణ ప్రజలకు నష్టం కలిగించ కుండా వ్యాపార ఒప్పందాలపై పారదర్శకత ఉండేలా స్టాంప్ విధానాన్ని అమలు చేయాలను కుంటున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఇందుకు అనుగుణంగా తెలంగాణ సవరణ బిల్లు-2025ను తీసుకురావాలని నిర్ణయిం చినట్లు పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మిగతావి 2లో

## ట్రంప్ సుంకాలకు తలొగ్గుతారు చూడండి

(మొదటి పేజీ తరువాయి)

ఒప్పందంపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ గుండెలు బాదుకోవడం తప్ప చేసేదేమీ ఉండదని రాహుల్ పేర్కొన్నారు. మూడు నెలల క్రితం భారత్‌పై 26 శాతం సుంకాలు విధిస్తున్నట్లు- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. 90 రోజుల విరామం తర్వాత అది అమల్లోకి రాకుండా ఉండేందుకు వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి భారత్ ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా పరస్పర సుంకాల సస్పెన్షన్ జులై 9న ముగియనున్నందున, ఆ గడువుకు ముందే చర్చలు పూర్తి చేయాలని ఇరుదేశాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల విషయంలో భారత్ పటిష్ఠ విధానాలను కలిగిఉందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. సమయం దాటిపోతున్నా ప్రధాని మోదీ సుంకాల తగ్గింపునకు అగ్రరాజ్యంతో ఎటువంటి చర్చలు జరపట్లేదని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ ఇలాగే నిశ్శబ్దంగా ఉండి చివరికి ట్రంప్ విధించిన సుంకాలకు తలొగ్గడం తప్ప వేరే దారి ఉండదని వ్యాఖ్యానించారు.

## ఆస్పత్రి నుంచి కెసిఆర్ డిశ్చార్జ్



**హైదరాబాద్,జూలై 5 (పీసీడబ్ల్యూ న్యూస్):**మాజీ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ సోమాజిగూడ యశోద ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. సాధారణ ఆరోగ్య పరీక్షల్లో భాగంగా ఆయన గురువారం ఆసుపత్రిలో చేరారు. బ్లడ్ షుగర్, సోడియం స్థాయులు మానిటర్ చేయడానికి ఆసుపత్రిలో చేరాల్సిందిగా వైద్యులు సూచించారు. ఆయన రెండు రోజులు అక్కడే ఉండి చికిత్స పొందారు. ప్రస్తుతం కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో శనివారం ఉదయం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి నందినగర్‌లోని నివాసానికి వెళ్లారు.

## మంత్రి సీతక్కకు వచ్చిన మావోల లేఖ ఫేక్



**వరంగల్,జూలై 5 (పీసీడబ్ల్యూ న్యూస్):** మంత్రి సీతక్కకు వార్నింగ్ ఇస్తూ వారం క్రితం మావోయిస్టులు విడుదల చేసిన లేఖ ఫేక్ అని తేలింది. ఇలాంటి లేఖ ఏదీ తాము రాయలేదని ఇప్పుడు మావో అధికార ప్రతినిధి పేరుతో ఓ లేఖ విడుదలయ్యింది. ఆ లేఖ మేం రాయలేదంటూ మరో లేఖ విడుదల చేయడంతో ఫేక లేఖ ఎవరిదన్నది ఇప్పుడు బయటపడాల్సి ఉంది. మంత్రిను హెచ్చ రిస్తూ మావోయిస్టులు రిలీజ్ చేసిన లేఖపై మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ క్లారిటీ- ఇచ్చారు. ఈ మేరకు ఒక అధికారిక పత్రికా ప్రకటన విడుదల చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ- పేరుతో 26.06.2025న మంత్రి సీతక్కపై వచ్చిన తాము రాయలేదని.. మా పార్టీకీ, ఆ లేఖకు ఎలాంటి సంబంధం లేదని తాజా లేఖలో స్పష్టం చేశారు. మావోయిస్టు రాష్ట్ర కార్య దర్శి బడే చొక్కారావ్ అలియాస్ లొంగుబాటులో వాస్తవం లేదని తెలిపారు.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. ఐదేళ్లలో వారికి రూ.లక్ష కోట్ల రుణాలు ఇవ్వాలనేది లక్ష్యమన్నారు. ఈ నెల 8న అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యక్రమాలపై చర్చించాలి. మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న లబ్ధి గురించి చర్చించాలి. గ్రామాలు, మండలాల్లో మహిళా సమాఖ్య సమావేశాలు ఏర్పాటు- చేయాలి. 10 నుంచి 16 వరకు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు ఉంటాయి. వడ్డీ లేని రుణాల నగదును చెక్కుల రూపంలో అందిస్తాం. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంపై ప్రజలకు వివరించాలని భట్టి విక్రమార్క తెలిపారు.

## శ్రీకృష్ణనగర్ బస్తీలో మురుగునీరు పారకం

(మొదటి పేజీ తరువాయి)

ఊహించారా అని అన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని శ్రీకృష్ణనగర్ బస్తీలో శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటించారు. స్థానిక కమ్యూనిటీ- హాల్ సీ బ్లాక్‌లో ఇళ్ల ముందు పెద్ద ఎత్తున మురుగునీరు పారుతుం డటంతో తీవ్ర అసహనానికి గురయ్యారు. గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని స్థానికులు కిషన్‌రెడ్డి ఎదుట వాపోయారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. తీవ్ర ఆగ్రహం చెందిన ఆయన.. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తో ఫోన్లో మాట్లాడారు. వెంటనే మురుగు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. 'మీ ఇంటి ముందు ఇలా మురు గు ఉంటే ఒక్క నిమిషమైనా ఉండగలరా?' అని తీవ్రంగా మందలించారు.

## చిన్నారులపై లైంగిక దాడి కేసుల్లో కఠిన శిక్షలు

(మొదటి పేజీ తరువాయి)

నేరాలను నియంత్రించడమే కాకుండా బాల బాధితులకు చట్టపరమైన అన్ని రకాల రక్షణ కల్పించాల్సి ఉంది. లైంగిక వేధింపుల నుంచి అన్ని రకాలుగా రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మా ప్రభుత్వం పిల్లలు, మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. బాలికల సంరక్షణ కోసం తెలంగాణ భరోసా ప్రాజెక్టును తీసుకొచ్చిందన్నారు. అనుసంధానంగా 29 కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఈ కేంద్రాల ద్వారా పోలీసు సహాయమే కాకుండా న్యాయ పరమైన సహాయం, వైద్య సహాయం, కౌన్సెలింగ్ వంటి సేవలను అందిస్తున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న భరోసా కేంద్రం ద్వారా చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టులను ప్రారంభించిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. కేసులను వేగవంతంగా పరిష్కరించడమే కాకుండా పిల్లలకు సంపూర్ణ రక్షణ, వారిలో విశ్వాసం, అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడం ఈ కేంద్రాల లక్ష్యం అని వివరించారు. పోక్సో చట్టం, జ్యువెనైల్ చట్టాలు మన ప్రగతిశీల సాధనాలుగా పనిచేస్తున్నాయి. అయితే ఆచరణలో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. ఆ చట్టాలు బాధితులకు ఎలాంటి హాని కలిగించకుండా, వారి భవిష్యత్తుకు రక్షణగా సంపూర్ణ సహాయకారిగా ఉండాలి. సోషల్ మీడియా ద్వారా పిల్లలపై జరిగే దురాగతాలు, దుర్వినియోగం చేస్తున్న వారి పట్ల ఎలాంటి కరుణ చూపకుండా దోషుల విషయంలో కఠినంగా వ్యవహరించాలి. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. న్యాయం కేవలం కోర్టుల్లోనే కాకుండా ప్రతి దశలోనూ రక్షణ ఉండాలి. పోలీస్ స్టేషన్, బాలల సంక్షేమ కేంద్రాలతో అన్ని ప్రక్రియల ద్వారా పిల్లలకు న్యాయం దక్కాలి. రక్షణ కల్పించాలని సిఎం అన్నారు. గౌరవ న్యాయమూర్తులు, పోలీసు అధికారులు బాలల సంక్షేమ కమిటీ-లు, ఇతర అభివృద్ధి భాగస్వామ్య సభ్యులందరికీ... విజ్ఞప్తి చేస్తున్నాను. ఇలాంటి విషయాల్లో అందరం కలిసికట్టు-గా ముందుకు సాగుదాం. న్యాయమంటే కేవలం శిక్షలు విధించడం వరకే కాదు. బాధితుల జీవితానికి భరోసా కల్పించాలి. వారికి అవసరమైన రక్షణ, సమాజంలో తగిన గౌరవం కల్పించేలా చర్యలు తీసుకుని వారి బాల్యాన్ని తిరిగి పొందేలా చర్యలు ఉండాలని అన్నారు.

## ఎన్‌డిఎకు జాతి ప్రయోజనాలే ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

బలహీనంగా మారిన దేశాన్ని బలమైన, అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారన్నని తెలిపారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీపై గోయల్ తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ హయాంలో ఆ పార్టీ నేతలు జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకమైన ఇతర దేశాలతో ఒప్పందాలు చేసుకున్నారని వ్యాఖ్యానించారు. భారత్‌కు ప్రపంచంలోని ఏ దేశంతో అయినా పోటీ- పడగలిగే సామర్థం ఉందని తాము విశ్వాసిస్తున్నామన్నారు. ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటే మాత్రమే ఏ దేశంతో అయినా వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడానికి భారత్ సంసిద్ధతను వ్యక్తం చేస్తుందని గోయల్ అన్నారు. అలా కానీ పక్షంలో ఎట్టిపరిస్థితుల్లోనే ప్రపంచ దేశాలతో వాణిజ్య సంబంధాలను ఏర్పరుచుకోమని స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్.. మారిషస్, యునైటె-డ్ అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రేలియా, స్విట్జర్లాండ్, నార్వే, యూకే వంటి దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుందని గోయల్ వెల్లడించారు. ప్రస్తుతం ఈయూ దేశాల కూటమి, అమెరికా, ఒమన్, పెరూ, చిలీ సహా ఇతర అభివృద్ధి చెందిన దేశాలతోనూ వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తోందని అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై 26 శాతం సుంకాలు విధిస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే. యూఎస్ పరస్పర సుంకాల సస్పెన్షన్ జులై 9న ముగియనున్నందున, ఆ గడువుకు ముందే చర్చలు పూర్తి చేయాలని ఇరుదేశాలు భావిస్తున్నాయి. గడువు ఆధారంగా కీలకమైన వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేసుకునేందుకు దేశం ఎప్పుడూ తొందరపడదని అన్నారు. రెండు వర్గాలకు లాభదాయకంగా ఉంటేనే అంగీకరిస్తుందన్నారు. అమెరికాతో కుదుర్చుకోనున్న ఒప్పందంలో భాగంగా భారత్ కొన్ని కీలక రంగాల్లో సుంకాల నుంచి అగ్రరాజ్యాన్ని సడలింపు కోరుతోంది. ఇందులో టెక్స్టైల్స్, రత్నాలు, ఆభరణాలు, దుస్తులు, ఎలాస్టిక్స్, రసాయనాలు, రొయ్యలు, నూనె గింజలు, ద్రాక్ష, అరటిపండ్లు వంటివి ఉన్నాయి. మరోవైపు అమెరికా కొన్ని పారిశ్రామిక వస్తువులు, ఆటోమొబైల్స్ (ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు), వైన్స్, పెట్రో కెమికల్ ఉత్పత్తులు, పాడి ఉత్పత్తులు రంగాల్లో సుంకాల సడలింపు కోరుతోంది. అయితే ఈ సడలింపులను ఆమోదిస్తే, మన దేశంలో రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయనే ఆందోళన ఉంది. ఇది రాజకీయంగా సున్నిత అంశమైనందున, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకం మినహాయింపులకు భారత్ ససేమిరా అంటోంది. వాణిజ్య చర్చల నిమిత్తం ఇటీవల అమెరికా వెళ్లిన భారత బృందం తిరిగి వచ్చింది. దీంతో అమెరికా-భారత్ మధ్య ఈనెల 9లోగా మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉన్నట్లు- తెలుస్తోంది.

## అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన రామచంద్రరావు

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీలోనే సాధ్యమని.. ఇందుకు తన ఎన్నికే నిదర్శనమన్నారు. రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి స్పష్టమైన కార్యచరణతో ముందుకెళ్తామని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీకి ఒక అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరుతామన్నారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ చేసిన రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో జరగలేదని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని తెలిసి ఇష్టమొచ్చినట్లు హామీలు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు ఉసురు తగులుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే రైతు భరోసా ఇచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో యూరియా కొరతపై దుష్ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులను తప్పుదోవ పట్టిస్తుందని మండిపడ్డారు. కేంద్రం ఇచ్చిన యూరియాను రాష్ట్ర పాలకులు తినేశారా అని ఆరోపించారు. మోడీ, బీజేపీని తిట్టడమే కాంగ్రెస్ సామాజిన న్యాయ సభ ఉద్దేశమా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ, పలువురు సీనియర్ నేతలు పాల్గొన్నారు. అంతకుముందు తన నివాసం నుంచి ర్యాలీగా వచ్చిన రామచందర్‌రావు ఉస్మానియా వర్సిటీలోని సరస్వతీ దేవాలయంలో, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీజేపీ విధానాలు నచ్చనివారు పార్టీని వీడినా నష్టం లేదంటూ వ్యాఖ్యానించారు. బీజేపీ విధానాలు, నిర్ణయాలు నచ్చక ఎవరు పార్టీని వీడినా నష్టం లేదని రామచంద్రరావు అన్నారు. పార్టీని నమ్ముకున్నవారిని బీజేపీ ఎప్పుడూ మోసం చేయదని, అందుకు తానే ఉదాహరణ అని చెప్పారు. పార్టీ అభివృద్ధికి పని చేసిన వారందరికీ అవకాశాలు వస్తాయన్నారు. కాంగ్రెస్ పార్టీ దోపిడీకి తెలంగాణ అక్షయ పాత్రగా మారిందని బిజెపి తెలంగాణ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆరోపించారు. కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కాంగ్రెస్ పార్టీ దోపిడీకి అక్షయపాత్రలుగా మారాయని వ్యాఖ్యానించారు. ఏడాదిన్నర కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఒక్క హామీని కూడా సమర్థంగా అమలు చేయలేకపోయిందని, ప్రజలకు ఏం సమాధానం చెబుతుందని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ సందర్భంగా రామచంద్రరావు స్పందిస్తూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో 6 గ్యారంటీ-లు, 13 హామీలు అంటూ భారీగా హడావుడి చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఏ హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందని అన్నారు. కులగణన పేరిట బీసీలకు అన్యాయం చేసి, ముస్లింలను బీసీ కోటాలో చేర్చడమే కాంగ్రెస్ సామాజిక న్యాయమా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు మళ్లీ మోసపోరని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 70 ఏళ్ల పాలనలో వెనుకబడిన వర్గాల వారిని ఎన్నడూ ప్రధానమంత్రి గాని ముఖ్యమంత్రిగా చేయలేద ని విమర్శించారు.

## వ్యవసాయంపై ఎక్కడ చర్చ పెట్టినా సిద్ధమే...

- సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 8న సిద్ధంగా ఉంటా
- ఎవరు రైతులకు మేలు చేశారో...చేయలేదో తేలుస్తాం
- ఈ చర్చకు కేసిఆర్ అవసరం లేదు...నేను చాలు
- మీడియా సమావేశంలో రేవంత్‌కు కెటిఆర్ సవాల్



**హైదరాబాద్,జూలై 5 (పీసీడబ్ల్యూ న్యూస్):** వ్యవసాయంపై ఎక్కడ చర్చ పెట్టినా రావడానికి సిద్ధమని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 8న సిద్ధంగా ఉంటానని, సీఎం రేవంత్‌రెడ్డి చర్చకు రావాలన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ ధ్వజమెత్తారు. రైతుల బాగుపై కాంగ్రెస్ పార్టీ నేతల మాటలు.. దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఎరువులు, విత్తనాల కోసం రైతులు క్యూలైన్లలో చెప్పులు పెట్టడమేనా అని ప్రశ్నించారు. కొత్త రాష్ట్రాన్ని కేంద్రం ఇబ్బందులు పెట్టినా కేసీఆర్ నిలబడ్డారని గుర్తు చేశారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. నీటికి పల్లం ఎలా తెలుసో తెలంగాణ కు నీరు ఎవరు తీసుకు వచ్చారో అందరికి తెలుసు.. తెలంగాణ లో ఏ రైతును, ఎద్దును అడిగినా వ్యవసాయం పండుగ ఎవరు చేశారో చెప్తారు.. సీఎం నిన్న రంకెలు వేశాడు.. ఆయన సభ పెట్టాడంటే బూతులతోనే మాట్లాడతాడు.. మా పార్టీ తరుపున మీ సవాలు స్వీకరిస్తున్నాం.. ఎక్కడ చర్చ పెట్టినా వస్తాం.. మీకు కేసీఆర్ అవసరం లేదు.. మేము చాలు.. 72 గంటలు ఇస్తున్నాం.. మీరు ప్రిపేర్ అయి రండి.. సీఎంకు బేసిన్ లు తెలియదు బెండకాయలు తెలియదు.. సమైక్య రాష్ట్రంలో నీళ్లు ఇవ్వలేదు కాబట్టే తెలంగాణ ఉద్యమం పుట్టింది..సీఎం రేవంత్ రెడ్డి హయాంలో నీళ్లు ఆంధ్రకు, నిధులు ఢిల్లీకి, నియామకాలు ఆయన అనునాయులకు వచ్చాయని అంటూ విమర్శలు గుప్పించారు. ఇందిరమ్మ రాజ్యం గొప్పతనం తెలియాలి అంటే బట్టలు విప్పి కొడతాం అన్నారు.. బనకచర్ల ద్వారా మీ గురువు చంద్రబాబు తీసుకెళ్తుంటే మీ తీరు తెలంగాణ సమాజం చూస్తూనే ఉంది. బురద జల్లి తప్పించుకునే అలవాటు సీఎం కి ఉంది.. 8 వ తారీఖు 11 గంటలకు సోమజిగూడా ప్రెస్ క్లబ్ కు మేము వస్తాము.. మీరు రండి మీడియా ముందే చర్చిద్దాం.. కేసీఆర్ ప్రభుత్వం నాట్లు వచ్చినప్పుడు రైతు బంధు ఇచ్చేది... ఓట్లు వచ్చేముందు రైతు భరోసా ఇస్తుంది కాంగ్రెస్.. ఇప్పటి వరకు రైతులకు ఎకరానికి 19 వేలు ఎగ్గొట్టారు. అన్నదాతకు సున్నం పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం.. మందికి పుట్టిన బిడ్డలు నా బిడ్డలు అనడానికి సిగ్గు లేదా.. మేము ఇచ్చిన ఉద్యోగాలు మీరు ఇచ్చినట్లు- చెప్పుకుంటున్నారు.. అశోక్ నగర్ లో చర్చకు వస్తావా.. ఈ మూడు రోజులు మీకు టైం ఇస్తున్నాం.. అప్పటివరకు మీరు చెప్పకుంటే.. 8వ తేదీన మేము సోమజిగూడా ప్రెస్‌క్లబ్ లో సిద్ధం గా ఉంటాం.. మీలాగా మందబలంతో కాకుండా 10,15 మందితో వస్తాం.. ఈయన ఇచ్చే డబ్బులతో ఢిల్లీ టకీ టకీ అని మోగుతున్నాయి.. కాంగ్రెస్ ఎమ్మెల్యే చెప్పినట్లు- చంద్రబాబు కోవర్ట్ రేవంత్ రెడ్డినే.. ఆ ఎమ్మెల్యే చాలా కరెక్టు గా చెప్పాడు.. అలా చెప్పిన ఎమ్మెల్యేను అభినందిస్తున్నాను అని కేటీఆర్ తెలిపారు.

## స్టాంప్ సవరణ చట్టం కోసం కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లును తీసుకువచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు. ఈ సవరణ బిల్లుపై శనివారం నాడు డాక్టర్ బి. ఆర్.అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, రెవెన్యూ శాఖ కార్యదర్శి డి. ఎస్.లోకేష్ కుమార్, న్యాయ వ్యవహారాల కార్యదర్శి రెండ్ల తిరుపతి, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, ముఖ్యమంత్రి కార్యాలయ ఒఎస్డి వేముల శ్రీనివాస్ తదితరులతో సమావేశం నిర్వహించారు. భారతీయ స్టాంపు చట్టం 1899 ప్రకారం, తెలంగాణ పరిధిలో నాలుగు సెక్షన్లను మరియు 26 ఆర్టికల్స్ ను సవరించుట కొరకు 2021 సంవత్సరంలో శాసనసభలో సవరణ బిల్లును ఆమోదించి కేంద్రప్రభుత్వం ఆమోదం కొరకు పంపడం జరిగిందని అయితే ఈ బిల్లుపై కేంద్రం వ్యక్తం చేసిన అభ్యంతరాలకు సమాధానం ఇచ్చినప్పటికీ 2023 జనవరిలో భారత ప్రభుత్వం ఈ సవరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వానికి తిరిగి పంపించడం జరిగిందని ఈ సందర్భంగా అధికారులు మంత్రి దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2021లో ప్రవేశపెట్టిన సవరణ బిల్లును ఉపసంహరించుకొని ప్రస్తుత కాలానికి అనుగుణంగా 2025 సవరణ బిల్లును తీసుకురావాలని నిర్ణయించినట్లు- వెల్లడించారు. సామాన్య ప్రజలను దృష్టిలో పెట్టుకుని, నిబంధనలు కట్టుదిట్టమైన రూపంలోకి తీసుకురావడం కొత్త ఒప్పందాలకు చట్టబద్ధత కల్పించడం లక్ష్యంగా బిల్లును రూపొందించాలని అలాగే పాత చట్టంలో లేనివాటిని కొత్త చట్టం పరిధిలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. వచ్చే శాసనసభ సమావేశాల్లో ఈ సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని సూచించారు. సామాన్య మధ్యతరగతి ప్రజానీకంపై ఎలాంటి భారం పడకుండా ప్రస్తుత మార్కెట్ విలువలకు అనుగుణంగా భూముల ధరలను సవరించాలని ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఎలాంటి విమర్శలకు తావులేకుండా శాస్త్రీయ పద్ధతిలో భూముల ధరల సవరణ జరగాలన్నారు. ఏఏ ప్రాంతాల్లో ఎక్కువ వ్యత్యాసం ఉంది అక్కడ హేతబద్ధంగా ఎంత శాతం పెంచేందుకు అవకాశం ఉంది తదితర అంశాలపై లోతైన అధ్యయనం చేయాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళా భ్యదయం కోసం ఎన్నో చర్యలు చేపడుతోందని దీనిలో భాగంగా మహిళలకు స్టాంప్ డ్యూటీ- తగ్గించాలన్న ఆలోచన చేస్తున్నామని అలాగే కొత్త, పాత అపార్ట్‌మెంట్ లకు స్టాంప్ డ్యూటీ- ఒకే విధంగా ఉందని పాత అపార్ట్ మెంట్‌లకు రిజిస్ట్రేషన్ తేదీలను పరిగణనలోకి తీసుకొని స్టాంప్ డ్యూటీ- తగ్గించాలన్న ఆలోచన చేస్తున్నామని ఈ రెండు అంశాలపై గౌరవ ముఖ్యమంత్రితో చర్చించి విధివిధానాలపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.



# విద్యార్థి సంఘాల పేరుతో వసూళ్లకు వస్తే కేసులు పెట్టండి

**● దళారులను హాస్టల్లోకి రానివ్వద్దు ● విద్యార్థులకు నాణ్యతమైన భోజనాన్ని అందించండి ● హాస్టల్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం ● ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన నేషనల్ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్**



**హనుమకొండ, జూలై 5 (పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ హాస్టల్స్ లలో విద్యార్థి సంఘాల పేరుతో చందాలకు గాని వసూళ్లకు గాని పాల్పడితే కేసులు నమోదు చేయండి అని అధికారులను సూచించారు. సంఘాల వారికి మామూలు ఇవ్వడం వల్ల హాస్టల్లో ఉండే విద్యార్థులకు నాణ్యమైన భోజనం కరువైందని ఘాటుగా విమర్శించారు. హాస్టల్లో హెడ్మాస్టరు, వార్డెన్లు తప్పు చేయొద్దని, మధ్య దళారులకు భయపడి వారికి మామూలు ఇవ్వకూడదని సూచించారు. శనివారము హనుమకొండ నగరంలోని జులైవాడలో బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల ను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జులైవాడ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాలు సరిగా లేవని , 400 మంది ఇప్పటికి పైగా ఉండే విద్యార్థుల కొరకు కనిస సౌకర్యాలు కరువయ్యాయని వాపోయారు. పాఠశాల అంటే మంచి విద్యాబోధన, ప్రభుత్వ మెను ప్రకారము ఆహారం అందేలా చూడాలని, విద్యార్థి సంఘాల పేరుతో వసూళ్లకు పాల్పడే వారిని గుర్తించి వారిపై ఫిర్యాదులు చేయాలని అధికారులను సూచించారు. విద్యార్థులకు కేటాయించే నిధులలో విద్యార్థి సంఘాలు వసూళ్లకు పాల్పడే బ్యాచులు ఉన్నన్ని రోజులు విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఉండదని పేర్కొన్నారు. అలాగని వార్డెన్ హెడ్మాస్టర్లు ప్రిన్సిపాల్ లు తప్పు చేస్తే విడిచి పెట్టే ప్రసక్తే లేదని అధికారులను హెచ్చరించారు. ప్రతి ఆదివారం నాడు పండగ వాతావరణం ను తలపించేలా కల్చరల్ ప్రోగ్రామ్లు ఏర్పాటు తో హాస్టల్ వాతావరణ ఉండాలని, ప్రతిరోజు గుడ్డుతోపాటు, చికెన్, మటన్ పండ్లు అందించాలని, విద్యార్థినులకు హాస్టల్కు వచ్చిన తర్వాత ఇల్లు గుర్తు రాకుండా ఉపాధ్యాయులు, వార్డెన్లు తల్లిదండ్రుల మాదిరిగా వారిని చూసుకోవాలని , వారి సొమ్మును దోచుకోవాలని చూస్తే ఎస్టీ కమిషన్ ఊరుకోదని హెచ్చరించారు. జులైవాడ హాస్టల్ ఎన్నో సంవత్సరాలుగా వేలాదిమంది విద్యార్థులకు బోధన అందించారని కానీ వారిని ఉన్నత స్థానంలో నిలపడంలో ఉపాధ్యాయుల బృందం విఫలమైందని అన్నారు. త్వరలోనే హాస్టల్ కు కావలసినటువంటి మౌలిక సదుపాయాలు ఏమైతే ఉన్నాయో .. తనకు పంపించాలని అన్ని విధాలుగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసే దిశలో.. ఎస్టి కమిషన్ చొరవ తీసుకుంటుందన్నారు. హాస్టల్లో మినరల్ వాటర్ ప్లాంట్, ప్రొజెక్టర్లు, రెండు నెలల లోపు ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులతో ముఖాముఖి విద్యార్థినులతో జాతీయ ఎస్టి కమిషన్ సభ్యులు ముఖాముఖి నిర్వహించారు. ఒక్కో విద్యార్థిని హాస్టల్లో ఉన్న సమస్యలపై మాట్లాడాలని కోరగా.. హాస్టల్లో క్రీడస్థలం లేదని, వాటర్ ప్లాంట్ లేదని, క్లాసులు చెప్పేందుకు ప్రొజెక్టర్లు లేవని.. విద్యార్థులు కోరగా అన్ని ఏర్పాట్లు తానే దగ్గర ఉండే చేపిస్తానని.. అలాగే క్రీడల కోసం .. హాస్టల్ లో క్రీడా మైదానం ఏర్పాటు చేద్దామన్నారు. రానున్న రోజుల్లో ఎస్సీ ఎస్టీలు ఉన్నత స్థాయిలో ఉండేలా మొదటినుండి ఇంగ్లీష్ ,హిందీ బాగా నేర్చుకోవాలని... తెలుగు మాట్లాడితే తెలంగాణలోనే ఉంటారని, హిందీ మాట్లాడితే ఇండియా అంతా తిరుగుతారని, ఇంగ్లీష్ మాట్లాడితే ఇతర దేశాల్లో సైతం వెళ్తుంటారని ఆయన పేర్కొన్నారు. చదువును ఇష్టపడి చదవాలని కష్టంతో చదివితే ఉన్నతశ్రేణిలో రాలేమని , విద్యార్థులు పోటీ తత్వంతో చదువులో పోటీ పడాలని , 10/10 మార్కులు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని , ఎన్సిసి ,స్కౌట్స్, క్రీడలలో రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ స్థాయికి గిరిజన విద్యార్థులు ఎన్నిక కావలసిన అవసరం ఉందన్నారు. జులై వడ ఆశ్రమ పాఠశాల నుండి క్రీడలలో తక్కువ శాతం విద్యార్థులు ఉంటున్నారని, కబడ్డీ , ఖో ఖో, ఆర్చరీ, విద్యలలో ప్రావీణ్యం పొందాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ అడిషనల్ కలెక్టర్ వెంకటరెడ్డి, ఆర్డీవో రమేష్ రాథోడ్, ఐటిడిఏ ఏపీఓ వసంత్ జాదవ్, హనుమకొండ డిటిడిఓ ప్రేమ కళ, వరంగల్ డిటిడిఓ సౌజన్య, హెడ్మాస్టర్ రమాదేవి, గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి వినోద్ లోక్ నాయక్, బిఆర్ ఎస్ నాయకులు మునావత్ నరసింహ నాయక్, స్టేషన్ఘన్పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రమేష్, మాజీ ఎంపిటిసి సోము, కేయూ విద్యార్థి సంఘం నాయకులు గుగులోతు రాజు నాయక్, విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు అజ్మీరా వెంకట్, గోర్ సేన జిల్లా అధ్యక్షులు తేజావత్ ఫణి కుమార్, జి బి ఎస్ ఎస్ ఎస్ కోశాధికారి, కార్యదర్శిగుగులో తిరుపతి, గుగులోతు వినేష్ విద్యార్థులు వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మానుకోట ఎర్రకోటగా మారాలి

**● దోపిడీ ఉన్నంత కాలం ఎర్రజెండా ఉంటుంది ● కేశవరావును అమిత్ షా అన్యాయంగా చంపారు ● అడవిని దోచుకోవడం కోసమే మావోయిస్టులను చంపేస్తున్నారు ● మావోయిస్టు, సిపిఎం, సీపీఐ(ఎంఎల్)అంటే మన వాళ్ళే ● సీపీఐ పెద్దన్న పాత్ర పోషిస్తుంది ● కమ్యూనిస్ట్ లంతా ఒక్క గూటికి చేరడానికి సిద్ధం ● ఖమ్మంలో డిసెంబర్-26 వంద సంవత్సరాల ● వేడుకను లక్షలాదిమందితో నిర్వహించబోతున్నాం ● ఎర్రకోటపై ఎర్రజెండా ఎగురావేస్తాం: సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**



**కురవి, జూలై05(పిసిడబ్ల్యూ న్యూస్):** కమ్యూనిస్ట్ పార్టీ పుట్టింది మనిషి కోసం మనుషులు ఉన్నంతకాలం ఎర్రజెండా ఉంటుందని సిపిఐ రాష్ట్రకార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం కురవిలో సీపీఐ జిల్లా మహా బహిరంగ సభ జరిగింది. ముందుగా వేలాది ఎర్రసైన్యం దండుగా కదంతొక్కారు. గ్రామ పంచాయతీ నుండి అంబేద్కర్ సెంటర్ నుండి బహిరంగ సభ వరకు కళాకారులతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం బహిరంగ సభకు జిల్లా కార్యదర్శి విజయ్ శారధి అధ్యక్షతన నిర్వహించిన సభకు ముఖ్యఅతిధిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ పుట్టింది మనిషి కోసం. దోపిడీ ఉన్నంతకాలం ఎర్రజెండా ఉంటుందన్నారు. దేశంలో గాని ప్రపంచవ్యాప్తంగా ఎర్రజెండా ఉంది. అవకాశం కోసం పార్టీలు మారుతున్నారు. అంటరానితనంకు వ్యతిరేకంగా పెట్టి చాకిరికి వ్యతిరేకంగా దున్నేవారికి భూమి కావాలి పేదవారికి హక్కులు కల్పించాలి. అనే నినాదంతో పోరాటం చేసింది కమ్యూనిస్టు పార్టీ అన్నారు. భూస్వాములు ఒక్కరు కూడా కమ్యూనిస్టు పార్టీలో ఉండరన్నారు. గౌతమ బుద్ధుడు, అంబేద్కర్, మార్క్స్, ఏసుక్రీస్తులు కూడా కమ్యూనిస్టులేనని, తల్లి గర్భంలో నుండి పుట్టారు కదా పేదవారు ఎందుకయ్యారు అనే ప్రశ్న సమాధానం కోసం గొప్పవాళ్లయ్యారన్నారు. రామ్ నారాయణ రెడ్డి, ఎల్లారెడ్డి, చంద్రారెడ్డి లు సమాజాన్ని మార్చడం కోసం కమ్యూనిస్టులు అయ్యారన్నారు. దేశంలో కమ్యూనిస్టు పార్టీని చంపాలని భూస్వాములు చూస్తున్నారన్నారు. కమ్యూనిస్ట్ లను పురిటిలోనే చంపాలని చూసిన కంసుని లాంటి బూర్జువాలు, పెత్తందార్లు, కార్పోరేట్ శక్తులు ఎందరో కాలగర్భంలో కలిసిపోయారు. శ్రీ కృష్ణుని లాగా కమ్యూనిజం సజీవం.. శాశ్వతంగా ఉంటుందన్నారు. నంబాల కేశవరావును అమిత్ షా అన్యాయంగా చంపారు. అడవిని దోచుకోవడం కోసం మావోయిస్టులను చంపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలతా కమ్యూనిస్టులు బ్రతకాలని కోరుకుంటున్నారు. అధికారం ఉన్న లేకున్నా కమ్యూనిస్టు లు ప్రజలకోసం పోరాడుతారు. బూచివ పార్టీలు వచ్చి కనుమరుగై పోతున్నాయని కమ్యూనిస్టు పార్టీ ఎప్పటికైనా పేదల పక్షాన ఉంటుందన్నారు. ఈ భూమిపై మనుషులు ఉన్నంతకాలం కమ్యూనిస్టు పార్టీ ఉంటుందన్నారు. దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో కమ్యూనిస్టు పార్టీ పోరాడుతుందని, డిసెంబర్ 26న సిపిఐ పుట్టినరోజు ఖమ్మంలో జరుగుతుందన్నారు. బొట్టు బొట్టు కలిస్తే సముద్రం గా మారినట్లుగా కమ్యూనిస్టు పార్టీ లక్ష మందితో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. కమ్యూనిస్టు పార్టీ అంటే భరించలేని వారు భూస్వామి పార్టీలో ఉంటారు. తల్లి గర్భం నుంచి ఎలా పుట్టాము కమ్యూనిస్టు పార్టీ అలా పుట్టిందన్నారు. తెలుగుదేశం ప్రజారాజ్యం వంటి పార్టీలు వచ్చి కనుమరుగయ్యాయని కానీ కమ్యూనిస్టు పార్టీ ప్రపంచవ్యాప్తంగా ఉంటుందన్నారు. ఎర్రజెండా అంటే రక్త ఉడుకుతుందని, తప్పు చేస్తుంటే చూస్తూ ఊరుకోం. పాలకులను ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. పదవులు మాకు ముఖ్యం కాదని, మమ్మల్ని, ప్రజల్ని కాదనుకొని బిఆర్ఎస్ ఫాంహౌస్ కు పోయింది. ప్రజలకు నష్టం చేస్తే రేపు కాంగ్రెస్ గతైనా అంతే. మావోయిస్టు అంటే మనవాడే సిపిఎం మనవాడే, సిపిఐ(యంయల్) మనవాడే ఎర్రజెండా పట్టుకున్న ప్రతివాడు మనవాడేనని, సీపీఐ పెద్దన్న పాత్ర పోషిస్తుంది అన్నారు. అడాల్ఫ్ హిట్లర్ వల్లే కాదు అల్ప్టాల్ అమిత్ షా నువ్వు కమ్యూనిజాన్ని లేకుండా చేయగలవా అని కూనంనేని ప్రశ్నించారు. సిపిఐ పెద్దన్న పాత్ర పోషిస్తుంది, 1951 వరకు మేము సాయుధపోరాటం చేసాం పరిస్థితులను బట్టి ఆయుధాలను జమ్మిచెట్టు మీద పెట్టాం. తీసే అవసరం రాకూడదనే కోరుకుంటున్నామని, మావోయిస్టులు కూడా ఆ..దిశగా ఆలోచన చేయండి అని కోరుతున్నామన్నారు. వేరుగా ఉన్న ఎర్రజెండాలు అన్ని కలిసే రోజు రావాలి.ఎర్రకోటపై ఎర్రజెండా ఎగరాలని కోరారు. పొత్తులు ఎత్తుగడలు మాత్రమే ప్రభుత్వాలు ప్రజలను పట్టించుకోకుంటే డిమాండ్ లను నెరవేర్చుకుంటే తెలంగాణాను దిగ్బందించడానికి వెనుకాడమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ జిల్లా పార్టీ సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి సభకు స్వాగతం పలికారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, అజయ్ సారధి, తమ్మెర విశ్వేశ్వర రావు, కర్ణం రాజన్న, నెల్లూరు నాగేశ్వరావు, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, సాంబ లక్ష్మి, వెంకన్న, నవీన్, బాలకృష్ణ, తురక రమేష్, బుర్ర సమ్మయ్య, తండ సతీష్, జంపాల వెంకన్న, నవీన్, శ్రీనివాస్, శేఖర్, గంజి శేషాద్రి రెడ్డి, బైస స్వామి, బుడుమ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఐపీఎస్ విద్యార్థులు....



**పెద్దపల్లి జిల్లా, జులై 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లా స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం పెద్దపల్లి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలలో పట్టణ కేంద్రంలోని స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు 14 సంవత్సరాల బాలుర విభాగంలో ఎం సంప్రీత్ 60 మీటర్లలో గోల్డ్ మెడల్, లాంగ్ జంప్ గోల్డ్ మెడల్,జి హర్షవర్ధన్ 60 మీటర్లలో గోల్డ్ మెడల్, లాంగ్ జంప్ గోల్డ్ మెడల్, 600 మీటర్లలో గోల్డ్ మెడల్, ఎస్ గగన్ 60 మీటర్లలో సిల్వర్ మెడల్,లాంగ్ జంప్ సిల్వర్ మెడల్ సాధించారు. అదేవిధంగా 14 సంవత్సరాల బాలికల విభాగంలో శ్రీనిధి 60 మీటర్లలో సిల్వర్ మెడల్,600 మీటర్ బ్రాంజ్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి ఎంపికైన క్రీడాకారులను పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ అభినంది ంచారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 6వ తేదీన హనుమకొండ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం, శివ, సతీష్, మమత, విద్యార్థులు పాల్గొన్నారు.





## ఆర్టీసీలో ఆదర్శ ఉద్యోగులకు సన్మానం

**పరకాల, జూలై 5(పీసీడబ్ల్యూ న్యూస్):** టీజియస్ ఆర్ టిసి పరకాల డిపోలో అత్యధిక ఇంధన పొదుపు చేసిన డ్రైవర్లను T.R కిషన్, Md. చాంద్ పాషాను పరకాల ఆర్టీసీ డిపో మేనేజర్ రవిచందర్ సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో మేనేజర్ రవిచందర్ మాట్లాడుతూ.. ఇంధన పొదుపు ద్వారా సంస్థకు అర్థిక అభివృద్ధికి, కాలుష్యం తగ్గించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరు ఇంధన పొదుపుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ రాజశ్రీ, అసిస్టెంట్ మేనేజర్ కృష్ణ కుమారి, సెఫ్టి వింగ్ ఇన్స్ట్రక్టర్ మొయినుద్దీన్ పాల్గొన్నారు.

## వాసవి కిట్టు పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా గోరింటాకు సంబరాలు



**గంగాధర, జూలై 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో మధురానగర్ లో గంగాధర మండల ఆర్యవైశ్య వాసవి కిట్టు పార్టీ మహిళలు అందరూ గోరింటాకు సంబరాలు ఘనంగా నిర్వహించినారు. మహిళలందరూ ఒకరికి ఒకరు గోరింటాకు పెట్టుకుని సంతోషం వ్యక్తం చేసినారు. ఆషాడ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం సాంప్రదాయంగా ఉన్నది. ఇట్టి కార్యక్రమానికి వాసవి కిట్టు పార్టీ మహిళలందరూ పాల్గొన్నారు.

## ఆవాసాల మధ్య ఉన్న ఖాళీ ప్లాట్ల యజమానులు ప్లాట్లను శుభ్రపరచుకోవాలి

**పరకాల, జులై 5(పిసిడబ్ల్యూ న్యూస్):** పురపాలక సంఘం పరకాల యందు ఆవాస ప్రాంతాలలో నివాస గృహాల మధ్యలో నిర్మాణాలు లేని ఖాళీ ప్లాట్లు ఉండడం వల్ల ప్లాట్‌లలో పెరిగే పిచ్చి మొక్కలను తొలగించకుండా అలాగే ప్లాట్‌లలో మరో నింపకుండా నిర్లక్ష్యంగా వదిలేయడం వల్ల, పట్టణ ప్రజల నుండి భారీ ఎత్తున ఫిర్యాదులు అందుచున్నందున, నివాస మధ్యలో ఉన్న ప్లాట్ల యజమానులు బాధితులను యొక్క ఖాళీ ప్లాట్లల్లో ఉన్న పిచ్చి మొక్కలు తొలగింపు చర్యలు చేపట్టాలని, అలాగే గుంతలుగా ఉన్న ప్లాట్ లలో మొరం మట్టితో నింపవలసిందిగా తెలియపరుస్తున్నట్లు కమిషనర్ సుష్మ తెలిపారు. వర్షాకాల నేపథ్యం వల్ల ఈ వర్షాకాల సీజన్‌లో ప్రజలకు ఆటంకాలు ఎదురై దోమల వ్యాప్తి, క్రిమి కీటకాలు, విషపూరితమైన జీవులతో భయంకర వ్యాధులు, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, ప్లాట్ల యజమానులు నిర్లక్ష్యం వహించకుండా వెంటనే శుభ్రపరచుకోవాలని, లేనిపక్షంలో మున్సిపల్ చట్టం 2019 ప్రకారం శాఖ పరమైన చర్యలుతీసుకోబడతాయని కమిషనర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## కుర్తివాడలో సిసి రోడ్డు పనులు ప్రారంభం



**పాపన్నపేట జులై 5(పిసిడబ్ల్యూ న్యూస్):** మండల పరిధిలోని కుర్తివాడలో రెండవ వార్డులో సిసి రోడ్డు పనులను శనివారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈ సందర్భంగా సిసి రోడ్లకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులతోపాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

# తెలంగాణ అసెంబ్లీ మీడియా అడ్వైజరీ కమిటీ (ఎంఏసీ) ఏర్పాటు...

**- చైర్మన్‌గా ఐరెడ్డి శ్రీనివాస్ రెడ్డి**

**- కో చైర్మన్‌గా పోలోజు పరిపూర్ణాచారి**




**హైదరాబాద్,జులై(పీసీడబ్ల్యూ న్యూస్):** 2025-2027 కాలానికి సంబంధించి తెలంగాణ అసెంబ్లీ మీడియా అడ్వైజరీ కమిటీని (ఎంఏసీ)రాష్ట్ర శాసన మండలి చైర్మన్, శాసనసభ స్పీకర్ ఏర్పాటు చేశారు. ఐరెడ్డి శ్రీనివాస్ రెడ్డి చైర్మన్ గా, పోలోజు పరిపూర్ణాచారిని కో చైర్మన్ గా నియమించారు. ఈ మేరకు 13 మంది సభ్యులతో కూడిన అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర శాసనసభ సంయుక్త కార్యదర్శి సీహెచ్. ఉపేందర్ రెడ్డి ప్రకటన విడుదల చేశారు. ఈ కమిటీలో ఐతరాజు రంగరావు, బొడ్లపాటి పూర్ణచంద్రరావు, లక్కడి వెంకట్ రామ్ రెడ్డి, పోలంపల్లి ఆంజనేయులు, ఎం.పవన్ కుమార్, భీమనపల్లి అశోక్, బుర్ర ఆంజనేయులు గౌడ్, సురేఖ అబ్బూరి, మహమ్మద్ నయీం వజాహత్, బసవ పున్నయ్య, ప్రమోద్ కుమార్ చతుర్వేది, సుంచు అశోక్, బి. హెచ్ ఎం.కే గాంధీలను ఈ కమిటీలో మెంబర్లుగా నామినేట్ చేయబడ్డారు.

# అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్ రావు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** జహీరాబాద్ మండలం కొత్తూర్ బి గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు రమేష్ రెడ్డి మాతృమూర్తి స్వర్గస్తులైనారు అనే విషయం తెలుసుకున్న జహీరాబాద్ శాసనసభ్యులు కొన్నింటి మాణిక్ రావు వారి గ్రామానికి చేరుకొని పార్థివ దేహానికి నివాళు లర్పించి ,కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు ఎమ్మెల్యే తో పాటుగా మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ,యువ నాయకులు మిథున్ రాజ్, చిన్న రెడ్డి,దీపక్,శ్రీకాంత్,పాప్ నాథ్,విజయ్ రాథోడ్‌లు ఉన్నారు.

# పటాన్చెరు డివిజన్లోని పలు కాలనీలలో పర్యటించిన కార్పొరేటర్ మెట్టు

**- స్థానిక కాలనీలలో సమస్యల పరిశిలించిన మెట్టు**



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు డివిజన్ పరిధిలోని పలుకాలనీలలో శనివారం కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పర్యటించి,స్థానిక కాలనీలలో సమస్యలను పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని సీతారామపురం కాలనీలో వర్షపు నీరు రోడ్లపై నిలవడంతో, రోడ్డంతా బురదమయంగా మారి స్థానిక కాలనీవాసులు రాకపోకలకు చాలా ఇబ్బంది పడుతున్నామని కార్పొరేటర్ కి తెలియజేయగా వెంటనే స్పందించి సొంత నిధులతో JCB యంత్రాలను రప్పించి రోడ్డును చదును చేయించారు.చదును చేసిన అనంతరం మట్టి వేసి మరమ్మతులు చేయిస్తామని కార్పొరేటర్ తెలియజేశారు.అనంతరం డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో జి హెచ్ ఎమ్ సి నిధులు 44 లక్షల రూపాయల అంచనా వ్యయంతో మంజూరైన నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులు స్థలం విషయంలో కోర్టు కేసుల వల్ల పెండింగులో ఉందని అన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ రోడ్డు నిర్మాణానికి అభ్యంతరం తెలిపిన వ్యక్తితో కలిసి రోడ్డు వేయాల్సిన స్థలాన్ని పరిశీలించారు. అభ్యంతరం ఉన్న చోట పక్కకు జరిపి రోడ్డు నిర్మాణం చేపట్టాలని అలాగే స్థానిక ప్రజల మేలు కొరకు రోడ్డు నిర్మాణ పనులకు సహకరించాలని కార్పొరేటర్ అభ్యంతరం తెలిపిన వ్యక్తిని కోరారు.



# ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలి: ఎస్ఎఫ్ఐ




**హుజూరాబాద్, జూలై 5(పిసిడబ్ల్యూ న్యూస్):** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పొడిశెట్టి అభిలాష్ ఆధ్వర్యంలో హుజూరాబాద్ తాసిల్దార్ కె. కనకయ్యకు శనివారం వినతి పత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా పొడిశెట్టి అభిలాష్ మాట్లాడుతూ, ఫీజు బకాయిల వల్ల రాష్ట్రంలోని విద్యార్థులు, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి బలవంతంగా పెండింగ్ ఫీజులను వసూలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని మండిపడ్డారు.బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యకు వెళ్లాలంటే సర్టిఫికెట్ల కోసం కళాశాలల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొన్ని కళాశాలలు ఒత్తిడి చేసి మరీ ఫీజులు వసూలు చేస్తున్నాయని అభిలాష్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుకుంటోందని ఆయన ఆరోపించారు.తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఫీజు బకాయిలను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. లేనిపక్షంలో భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సందీప్, బాలాజీ, సాయికిరణ్, సిద్దు, ప్రణయ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల వైద్యానికి సర్కార్ తోడ్పాటు...

- **117 మందికి సీఎంఆర్ఎఫ్,కళ్యాణలక్ష్మి చెక్కులు**
- **ఇల్లంతకుంటలో లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి...**







**ఇల్లంతకుంట,జూలై 5(పీసీడబ్ల్యూ న్యూస్) :** ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో తోడ్పడుతుందని నిరుపేదల వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో తోడ్పడుతుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు. శనివారం ఇల్లంతకుంట మండల పరిషత్ కార్యాలయంలో 84 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు 25.53 లక్షలు, 33 మంది కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు 33 లక్షల రూపాయల విలువ గల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించడం ద్వారా ప్రభుత్వం ఎంతో మందికి ఆర్థికంగా చేదోడు వాదోడుగా నిలుస్తోందన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరి బిల్లుల చెల్లింపులతో ఇబ్బందిపడుతున్న వారికి సీఎంఆర్ఎఫ్ సహాయం ఊతమిస్తుందన్నారు. వైద్యపరంగా ఎవరూ ఇబ్బందిపడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆర్థక సహాయం అందిస్తోందని ఎమ్మెల్యే వివరించారు. అర్హులైన వారందరికీ సీఎంఆర్ఎఫ్‌తోపాటు సంక్షేమ పథకాలు అందజేస్తామని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్, మండల మహిళా అధ్యక్షురాలు వెలిశాల జ్యోతి, పార్టీ నాయకులు పసుల వెంకటి, పాశం రాజేందర్ రెడ్డి, చిట్టి ఆనంద రెడ్డి, మామిడి నరేష్, మామిడి రాజు, నరేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, విజయ్, తిరుపతి తోపాటు లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్‌జి రోడ్డు నూతన నిర్మాణానికి నడుముకట్టిన కార్పొరేటర్ మెట్టు

- **జిహెచ్ఎమ్ సిడిఈని కలిసిన మెట్టు**
- **త్వరితగతిన పనులు చేపట్టాలని విజ్ఞప్తి**



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** డివిజన్ పరిధిలోని అంబేద్కర్ విగ్రహం నుండి మున్నూరు కాపు ఫంక్షన్ హాల్ వరకు నూతనంగా నిర్మిస్తున్న రోడ్డులో అడ్డదిడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి నూతనంగా వరుస క్రమంలో వేయాలని జి హెచ్ ఎమ్ సి విద్యుత్ శాఖ డి ఈ ని కోరిన కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్.సోమవారం 7వ తేదీ నుండి పనులు ప్రారంభిస్తామని తెలియజేసిన విద్యుత్ శాఖ DE భాస్కర రావు.పటాన్చెరు డివిజన్ పరిధిలోని సాయిరాం నగర్ కాలనీ చిన్నవాగు వరకు రోడ్డుకు అడ్డదిడ్డంగా ఉన్న విద్యుత్ స్థంబాలను తొలగించి వరుస క్రమంలో వెయ్యడం కొరకు ఫిబ్రవరి నెలలో 10 లక్షల రూపాయల నిధులు మంజూరు కావడం జరిగింది. కాగా ఇప్పటి వరకు ఆ స్తంభాలను తొలగించలేదు, అయితే ఇటీవల MG రోడ్డు అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి మున్నూరు కాపు ఫంక్షన్ హాల్ వరకు 1కోటి 40 లక్షల రూపాయలతో నూతన సీసీ రోడ్డు నిర్మాణం మంజూరు అవ్వడం జరిగింది. ఈ నూతన సిసి రోడ్డు నిర్మాణానికి విద్యుత్ స్థంబాల అడ్డుగా ఉండడంతో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ శనివారం రోజు TGSPDCL DE భాస్కర రావుని కలిసి సమస్యలు సవివరంగా వివరించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అడ్డుగా ఉన్న విద్యుత్ స్థంబాలను తొలగించేందుకు గాను నిధులు మంజూరు అయినప్పటికీ స్థంబాల తొలగింపు జరగలేదని, ఇప్పుడు నూతనంగా వేస్తున్న రోడ్డుకు ఆ విద్యుత్ స్థంబాలు అడ్డుగా ఉన్నాయని వెంటనే తొలగించాలని కార్పొరేటర్ గారు DE భాస్కర రావుని కోరడం జరిగింది.రోడ్డు నిర్మాణ పనులు సజావుగా సాగేందుకు సోమవారం 7వ తేదీ నుండి విద్యుత్ స్థంబాలను తొలగించే పనులను చేపడతామని విద్యుత్ శాఖ DE భాస్కర రావు తెలిపారు.ఈ కార్యక్రమంలో AE జగదీష్, ఫోర్ మెన్ వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్

# సమ్మయ్యకు ఘన సత్కారం



**హుజూరాబాద్, జూలై 5(పిసిడబ్ల్యూ న్యూస్):**తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ సంఘ భవనంలో ఈరోజు హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యను ఘనంగా సత్కరించారు. ఇటీవలి కాలంలో హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలో ఆయన అందించిన విశేష సేవలకు గాను, అలాగే రాష్ట్రస్థాయిలో ఉత్తమ కమిషనర్‌గా ప్రశంసలు అందుకున్న సందర్భంలో అసోసియేషన్ పక్షాన శాలువాతో సన్మానం చేశారు.ఈ సన్మాన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్ పాషా, కోశాధికారి కె. దుర్గా జి, ప్రచార కార్యదర్శి గంజి జవర్ధన్, జిల్లా కౌన్సిలర్లు పి. లక్ష్మీనారాయణ, చింత ఆగయ్య, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు విలాసాగరం వీరాస్వామి, కబడ్డీ సమ్మిరెడ్డి, వెలుపల రత్నం, మాజీ ఎంఈఓ ఆర్. రాజయ్య, గంగిశెట్టి జగదీశ్వర్, కె. వెంకటరెడ్డి, రిటైర్డ్ ఏఈ బోర్గాల మొగిలి, జున్నోతుల రామ్ రెడ్డి, మరియు ఎన్. తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమ్మయ్య సేవలను కొనియాడుతూ, అసోసియేషన్ సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు.

# స్వచ్ఛ హుజురాబాద్ లక్ష్యంగా: 22వ వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య తనిఖీ

- **హుజురాబాద్‌లో పారిశుద్ధ్య మహోత్సవం:**

**బస్ డిపో ఏరియాలో సమగ్ర ప్రక్షాళన**





**హుజూరాబాద్, జూలై 5(పిసిడబ్ల్యూ న్యూస్):**హుజురాబాద్ పట్టణాన్ని నివసించడానికి అనువైన, స్థిరమైన, పర్యావరణానికి హితమైన నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన నూరు రోజుల ప్రణాళికలో భాగంగా శని వారం 22వ వార్డులోని ఆర్టీసీ బస్సుల కేంద్రం పరిసరాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా, ఆ ప్రాంతంలోని రహదారులకు ఇరువైపులా పెరిగిన గడ్డి, చెత్తాచెదారాన్ని తొలగించి, పొదలను పూర్తిగా శుభ్రం చేశారు. వర్షాలకు మురుగు కాలవల నుంచి వరదనీరు రహదారులపైకి రాకుండా, కాలవల్లో పేరుకుపోయిన మట్టి, బురదను పూర్తిగా తొలగించారు. అదేవిధంగా, రహదారులపై వాహనాలకు అడ్డుగా ఉన్న మొరం, ఇసుక కుప్పలను భారీ యంత్రాలతో తొలగించి, దారిని సుగమం చేశారు.ఈ పారిశుద్ధ్య కార్యక్రమంలో పురపాలక సంఘం అధికారి ఆర్. భూపాల్ రెడ్డి, సహాయక ఇంజనీర్ ఎన్. సుధాకర్, సీనియర్ సహాయకులు జె. శ్రీకాంత్, జూనియర్ సహాయకులు రవీందర్ పాల్గొన్నారు. వీరితో పాటు వార్డు అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది రోంటాల సుధీర్, ప్రతాప రాజు, ఆరెల్లి రమేష్, టి. కుమారస్వామి, పి. అనిల్ కుమార్, మెప్మా సంస్థలోని ప్రాంతీయ కార్యకర్త కరుమల్ల స్వరూప, ఇతర కార్యాలయ సిబ్బంది ఈ గొప్ప కార్యక్రమంలో పాలుపంచు కున్నారు. పట్టణ పారిశుద్ధ్యానికి పురపాలక సంఘం కట్టుబడి ఉందని, ఇలాంటి కార్యక్రమా లు భవిష్యత్తులోనూ కొనసాగుతాయని హుజురాబాద్ పురపాలక సంఘం కమిషనర్ కె. సమ్మయ్య ఈ సందర్భంగా తెలిపారు.

# హుగ్గేల్లి గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుని నియామకం




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** జహీరాబాద్ శాసనసభ్యులు కొన్నింటి మాణిక్ రావు ఆదేశాల మేరకు శనివారం రోజు హుగ్గెల్లి గ్రామం నూతన గ్రామ బిఆర్ఎస్ పార్టీ కమిటీని నియమించిన జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఈ సంధర్భంగా నూతనంగా ఎన్నికైన గ్రామ పార్టీ అధ్యక్షులు దత్తురెడ్డి,వైస్ ప్రెసిడెంట్ గా ఎండీ అహ్మద్ ,జనరల్ సెక్రటరీగా బొడ తుకారాం లకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సంధర్బంగా ఎమ్మెల్యే మాణిక్ రావు, మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, గ్రామ పార్టీ నాయకులు నూతనంగా ఎన్నుకోబడిన నాయకులను సన్మానించి ,శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంధర్బంగా ఎమ్యెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ మోసపూరిత, 420 హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేని పక్షాన బి ఆర్ ఎస్ పార్టీ తరపున తమ పోరాటం తప్పదన్నారు. సమీష్టగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో పీజీ శంకర్,కిష్టా రెడ్డి,రాథోడ్ భీమ్ రావు నాయక్ ,మధు,అహ్మద్,కసిం,షకీల్,అడ్డు,బాబ్బు తదితరులు పాల్గొన్నారు.



# 30వ డివిజన్ అధ్యక్షుడు దొంతి గోపీ ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ...

- ప్రభుత్వ పనితీరు పట్ల లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేయడం ఆనందకరం.. - దొంతి గోపి
- నాడు సమస్యలపై పోరాడిన కాంగ్రెస్ పార్టీ నేడు ప్రజా సంక్షేమం కోసం ఆరాటపడుతుంది: దొంతి గోపి
- చెప్పుకునే అంత గొప్పగా చేసిందేమీ లేకనే కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్న బిజెపి, బిఆర్ఎస్





**కరీంనగర్,జూలై5(పీసీడబ్ల్యూ న్యూస్):**పలు ఆరోగ్య సమస్యలతో చికిత్స పొంది వైద్య ఖర్చులకోసం ప్రభుత్వాన్ని ఆశ్రయించిన 30వ డివిజన్ కాపువాడ, మారుతి నగర్ కు చెందిన బాధితులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన సీఎం సహాయ నిధి చెక్కులను డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, కాంగ్రెస్ నేత దొంతి గోపి నగర కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ తో కలిసి బాధితులకు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా దొంతి గోపి బాధితులతో మాట్లాడుతూ బిఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో దగాపడ్డ తెలంగాణను బతికించుకోవడానికి పోరాటం చేసిన కాంగ్రెస్ పార్టీ నేడు తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చి ప్రజా సంక్షేమం కోసం ఆరాటపడుతుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాకు చెందిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఆర్టీసీ లాభాల బాటలో పయనించడం శుభ పరిణామ పొన్నం ప్రభాకర్ రవాణా శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన 48 గంటలలో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పించి కొత్త అధ్యాయాన్ని లికించినారని పేర్కొన్నారు.అలాగే వాన కాలం పంట కాలానికి పెట్టుబడి సహాయం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా పథకం కింద కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 2,10,904 మంది అన్నదాతల ఖాతాల్లో సుమారుగా 21,90,69,841 రైతు భరోసా నిధులను రైతుల ఖాతాలో జమ చేసి రైతు పక్షపాత ప్రభుత్వం అని నిరూపించుకుందని వెల్లడించినారు.బిఆర్ఎస్ హయాంలో సామాన్య పేద ప్రజలు వేచి చూసి, విసిగిపోయి, మరిచిపోయిన తెల్ల రేషన్ కార్డులను తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కార్ రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల పైగా కొత్త రేషన్ కార్డులను అందజేసి ప్రజలు మెచ్చిన పరిపాలనను అందిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని, కరీంనగర్ జిల్లాలో కొత్తగా 10,738 తెల్ల రేషన్ కార్డులు మంజూరు కాగా కొత్త పాత కార్డులలో కలిపి 64,310 మంది కుటుంబ సభ్యుల పేర్లను చేర్చడంతో పాటు ఈ నెల నుండి వారందరికీ ఉచిత రేషన్ సన్న బియ్యం అందిస్తూ పేదల కడుపు నింపుతుందని తెలియజేశారు.ఈ విధంగా అన్ని రంగాలలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం పట్ల పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తూ ప్రజాభిమానాన్ని పొందుతుంటే జీర్ణించుకోలేని బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు వారి పరిపాలనలో చేసేంత గొప్పగా చెప్పుకునేందుకు ఏమీ లేక ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పై పడి ఏడుస్తూ సోషల్ మీడియా ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం పై విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు, అయినప్పటికీ ఇవన్నీ గమనిస్తున్న విజ్ఞులైన తెలంగాణ రాష్ట్ర ప్రజలు రేపు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు కచ్చితంగా గుణపాఠం చెబుతారని, అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఆదరిస్తారని తమకు సంపూర్ణ విశ్వాసం ఉందని దొంతి గోపి ధీమా వ్యక్తం చేశారు.

# ఆరు ఏళ్లలో రూ.20 వేల కోట్లకుపైగా అభివృద్ధి పనులు

- అభివృద్ధిలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిను నెంబర్ వన్గా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ప్రజల అభ్యున్నతి కోసం స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి పనిచేస్తున్నా
- కేంద్ర మంత్రిగా మరిన్ని నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తా
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- వీణవంక, జమ్మికుంట గంగ్రపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్లు ప్రారంభం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డితో కలిసి అభివృద్ధి పనులను ప్రారంభించిన కేంద్ర మంత్రి



**హుజురాబాద్,జూలై5(పీసీడబ్ల్యూ న్యూస్):** గడిచిన 6 ఏళ్లలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.20 వేల కోట్లకుపైగా నిధులను ఖర్చు చేసినట్లు కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. కేంద్ర మంత్రిగా మరిన్ని నిధులు తీసుకొచ్చి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దడమే లక్ష్యం పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల అభ్యున్నతి, సంక్షేమం కోసం రాజకీయ పార్టీలకు అతీతంగా స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈరోజు ఉదయం హుజూరాబాద్ నియోజకవర్గంలో పర్యటించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కు స్థానిక బీ ఆర్ ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి స్వాగతం పలికారు. ఆయనతో కలిసి జాతీయ ఉపాధి పథకం కింద వీణవంకలో రూ.78 లక్షల వ్యయంతో నిర్మించిన 18 అంతర్గత సీసీ రోడ్లను, అట్లాగే జమ్మికుంట మండంలోని గంద్రపల్లి, ఇతర గ్రామాల్లో 78 లక్షల వ్యయంతో నిర్మించిన 13 అంతర్గత రోడ్లను ప్రారంభించారు. స్థానిక బీజేపీ నాయకుల నివాసాలకు వెళ్లి ముచ్చటించారు. అనంతరం బండి సంజయ్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో ముఖ్యాంశాలు: హుజూరాబాద్ నియోజకవర్గంలోని వీణవంక మండలంలో జాతీయ ఉపాధి హామీ నిధుల కింద 78 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన 18 అంతర్గత సీసీ రోడ్లున ప్రారంభించడం చాలా ఆనందంగా ఉంది. మీకు తెలుసు మోదీగారి ప్రభుత్వం రోడ్లకు అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. నేను ఎంపీగా, కేంద్ర మంత్రిగా ఉంటూ ఎక్కువ నిధులు కరీంనగర్ పార్లమెంట్ కు తీసుకొచ్చానంటే అవి రోడ్ల కోసమే.కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి కోసం గత ఆరేళ్లలో మొత్తంగా 20 వేల కోట్ల రూపాయలకు పైగా నిధులు తీసుకొచ్చిన. అందులో సింహభాగం గ్రామీణ ఉపాధి హామీ, ప్రధానమంత్రి సడక్ యోజన, సీఆర్ఐఎఫ్ కార్యక్రమాల నిధులతోపాటు జాతీయ రహదారుల విస్తరణ కోసమే ఎక్కువ నిధులు తీసుకొచ్చిన. ఎందుకంటే ఏ దేశమైనా, రాష్ట్రమైనా, జిల్లా, గ్రామమైనా రవాణా సౌకర్యాలు బాగుంటేనే అవి బాగుపడతాయి. నేను ఐదు ఏళ్లు ఎంపీగా ఉన్నప్పుడు రెండేళ్ల కాలాన్ని కరోనా మింగేసింది. అయినా ప్రజల కోసం మోదీగారిని ఒప్పించి భారీ నిధులు తీసుకొచ్చా ఇప్పుడు కేంద్ర మంత్రిగా ఇంకా నిధులు తీసుకొచ్చే అవకాశం వచ్చింది. మొదటిసారి ఎంపీ అయినప్పుడు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించడంతో రాష్ట్రమంతా తిరిగాల్సి వచ్చింది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కరీంనగర్ పార్లమెంట్ ను అభివృద్ధిలో నెంబర్ 1గా తీర్చిదిద్దడమే లక్ష్యంతో పనిచేస్తున్నా. అందుకోసం స్థానిక ఎమ్మెల్యేలందరితో కలిసి అన్ని గ్రామాలు, మండలాలను అభివృద్ధి చేస్తున్నా...అందులో భాగంగా CRIF నిధుల కింద 291 కోట్ల రూపాయలను ఖర్చు చేసి 1341 కిలోమీటర్ల మేరకు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రోడ్లను నిర్మించినం. అట్లాగే జాతీయ ఉపాధి హామీ పథకం కింద గత ఆర్థిక సంవత్సరంలో పార్లమెంట్ నియోజకవర్గంలో 31 కోట్ల 13 లక్షల రూపాయలు ఖర్చు చేసి రోడ్లను నిర్మించినం. మొత్తంగా జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఇప్పటి వరకు దాదాపు 650 కోట్ల రూపాయల నిధులను మన పార్లమెంట్ పరిధిలో ఖర్చు చేసినం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీర్వాదంతో ఎంపీగా ఎన్నికైనప్పటి నుండి ఇప్పటి వరకు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో జాతీయ రహదారుల నిర్మాణం కోసం దాదాపు 5 వేల కోట్లకుపైగా ఖర్చు చేసినం. కరీంనగర్ నుండి వరంగల్, సిద్దిపేట నుండి ఎల్కతుర్తి నేషనల్ హైవేలను ఏ విధంగా అభివృద్ధి చేస్తున్నామో మీ అందరికీ తెలిసిందే. మరికొద్ది రోజుల్లోనే కరీంనగర్- జగిత్యాల రోడ్డ నిర్మాణ పనులను చేపట్టబోతున్నం. టెండర్ల ప్రక్రియ కూడా త్వరలోనే మొదలు కాబోతోంది. ఎన్నికల వరకే రాజకీయాలు. ఎన్నికల తరువాత అభివృద్ధే మా ధ్యేయం. అభివృద్ధి, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తిగా సహకరించేందుకు సిద్దంగా ఉన్నాం. ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులతో కలిసి పనిచేస్తున్నా. ఎందుకంటే అందరం కలిసి సమిష్టిగా పనిచేస్తే ప్రజలకు మరింత మేలు చేయొచ్చనే ఉద్దేశంతోనే పార్టీలకు అతీతంగా పనిచేస్తున్నా అందరూ సహకరించాలని, అంతిమంగా ఓట్లేసి గెలిపించిన ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేయాలని కోరుతున్నా.

# జర్నలిస్టుల ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలి

- కూనంనేనిని కోరిన టియుడబ్ల్యూజే(ఐజేయు) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావును మర్యాదపూర్వకంగా కలిసిన
- టియుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్, కురవి మండల అధ్యక్షులు గుంటి సురేష్



**కురవి జూలై 05(పి.సి.డబ్ల్యూ న్యూస్):**జర్నలిస్ట్ లు ఎదుర్కుంటున్న సమస్యల పరిష్కారానికి సహకరించాలని సిపిఐ రాష్ట్రకార్యదర్శి కూనంనేని సాంబశివరావు ను టియుడబ్ల్యూజే(ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ కోరారు. కురవిలో సిపిఐ జిల్లామహాసభలో పాల్గొనేందుకు శుక్రవారం వచ్చిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ను టియుడబ్ల్యూజే(ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్, కురవి మండలఅధ్యక్షుడు గుంటిసురేష్ లు మర్యాదపూర్వకంగా కలిసారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్ట్ లు ఎదుర్కుంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని, పరిష్కారం కోసం ప్రయత్నించాలని ఈ.. సందర్భంగా కూనంనేని సిహెచ్ శ్రీనివాస్ కోరారు. జర్నలిజం వృత్తిలోంచి వచ్చిన మీకు జర్నలిస్ట్ ల పరిస్థితులు, స్థితిగతులు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదని, జర్నలిస్ట్ ల గళాన్ని, అసెంబ్లీలోనూ, ప్రభుత్వ సమావేశాల్లోనూ బలంగా వినిపించాలని టియుడబ్ల్యూజే(ఐజేయు) మహబూబాబాద్ జిల్లా అద్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ కోరగా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు సానుకూలంగా స్పందించారు. ఖచ్చితంగా జర్నలిస్ట్ ల పక్షాన సిపిఐ పార్టీగా, శాసనసభ్యునిగా రాష్ట్రప్రభుత్వంతో ప్రత్యేకంగా మాట్లాడుతానని కూనంనేని సాంబశివరావు మాట ఇచ్చారు.

# నిరుపేదలకు ఆపన్న హస్తం సీఎంఆర్ఎఫ్

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- 48 మంది లబ్ధిదారులకు 22 లక్షల రూపాయల విలువైన చెక్కుల పంపిణీ





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఆపన్న హస్తంగా నిలుస్తోందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం ఉదయం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు, డివిజన్లకు సంబంధించిన 48 మంది లబ్ధిదారులకు మంజూరైన 22 లక్షల 10 వేల రూపాయల విలువైన చెక్కులను స్థానిక నాయకులతో కలిసి ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.పూర్తి పారదర్శకతతో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ ప్రభాకర్,డిసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామ్ రావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు ప్రమోద్ గౌడ్,వెంకటేష్, ఆంజనేయులు,జనార్ధన్, శివరాజ్,తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి కరీంనగర్ జిల్లా వైభవ గీతం పోస్టర్‌ను ఆవిష్కరించిన కేంద్రమంత్రి బండి సంజయ్...




**కరీంనగర్ జిల్లా,జూలై5(పీసీడబ్ల్యూ న్యూస్):** సినీ గేయ రచయిత గుండేటి రమేష్ రచన,గానం, దర్శకత్వం లో రూపుదిద్దుకోనున్న “ఉమ్మడి కరీంనగర్ జిల్లా వైభవ గీతం పోస్టర్ ను కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శనివారం రోజున కరీంనగర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకులు గుండేటి రమేష్ మాట్లాడుతూ ఈనెల 19 నుండి ఉమ్మడి కరీంనగర్ వైభవ షూటింగ్ ప్రారంభమవుతుందని, ఆగస్టు 2న గుండేటి మ్యూజిక్, మూవీస్ ద్వారా ఆల్బమ్ రిలీజ్ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యువజన సంఘాల సమితి బిజెపి రాష్ట్ర నాయకులు సొల్లు అజయ్ వర్మ, మాజీ కార్పొరేటర్ బండరమణ రెడ్డి , పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితుని కుటుంబానికి ఆర్థిక చేయూత



**చిట్యాల, జూన్ 5(పీసీడబ్ల్యు న్యూస్):** చిట్యాల మండలం తిరుమలాపూర్ గ్రామానికి చెందిన కంచర్ల పోషాలు ఇటీవల మృతి చెందారు. కాగా మృతుడి కుమారుడు కంచర్ల రాంబాబు 10వ తరగతి 2006 విద్యా సంవత్సరానికి చెందిన మిత్రులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మిత్రులందరికీ కలిసి జమ చేసిన రూ.23వేల నగదును మృతుని దశదినకర్మ రోజున కుటుంబ సభ్యులకు అందజేసి ఆసరాగా నిలిచారు. ఈ కార్యక్రమంలో చింతల మహేందర్, మురహరి భానుచందర్, ఉయ్యాల రమేష్, కల్వచర్ల రాము, చిలుముల రాజేష్, ఎండి సాజిత్, గుండ తిరుపతి, గోపగాని ప్రవీణ్, కమ్మగాని బాలకృష్ణ, రాయిని శ్రీకాంత్, కంచర్ల నాగరాజు, కోడెల నరేష్ మిత్రబృందం పాల్గొన్నారు.

## టీవీ9 వీడియో రిపోర్టర్ ప్రసాద్ గుండెపోటుతో మృతి...

### - వేములవాడ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి చల్మెడ సంతాపం...



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జులై5 (పీసీడబ్ల్యూ న్యూస్):** సిరిసిల్ల నియో జకవర్గ, టీయూ డబ్ల్యూజే 143 సభ్యుడు టీవీ9 రిపోర్టర్ గర్దాస్ ప్రసాద్ (45) ఈరోజు శనివారం ఉదయం గుండె పోటుతో మృతి చెందడంతో మీడియా రంగానికి, వారి కుటుంబ సభ్యులకు తీరని లోటు అని సంతాపం వ్యక్తం చేస్తూ బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్మెడ లక్ష్మీ నరసింహారావు అన్నారు. గర్దాస్ ప్రసాద్ గత కొన్ని సంవత్స రాలుగా మీడియా రంగంలో రిపోర్టర్ గా పనిచేస్తూ సిరిసిల్ల జిల్లాలో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించి ప్రజలతో పాటు జిల్లాలోని అధికారులతో మంచికి మారుపేరుగా సత్సంబ ంధాలు కలిగి ప్రజా సమస్యలను మీడియాతో పరిష్కరిస్తూ మంచి పేరు తెచ్చుకున్నారు. అయితే దురదృష్టవశాత్తు ప్రసాద్ ఈరోజు గుండెపోటుతో మృతి చెందడంతో చాలా బాధాకరమన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నామన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నామన్నారు.

## తృటిలో తప్పిన పెను ప్రమాదం

### - డ్రైవర్ అప్రమత్తతతో సురక్షితంగా 25 మంది ప్రయాణికులు

**హుజూరాబాద్,జూలై 5(పిసిడబ్ల్యూ న్యూస్):** హుజూరాబాద్‌లో శనివారం ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఆర్టీసీ డ్రైవర్‌కు ఒక్కసారిగా షుగర్ లెవల్స్ పడిపోయి నప్పటికీ, ఆయన అప్రమత్తత, ధైర్యంతో బస్సులో ఉన్న 25 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వివరాల్లోకి వెళ్తే, హుజూరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జమ్మికుంట నుంచి హుజూరాబాద్ వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సు నడుపుతున్న డ్రైవర్‌కు మార్గమధ్యలో ఒక్కసారిగా షుగర్ లెవల్స్ బాగా తగ్గిపోయాయి. తీవ్ర ఇబ్బంది పడుతున్నప్పటికీ, డ్రైవర్ తన ధైర్యాన్ని కోల్పోకుండా బస్సును నియంత్రించి, సురక్షి తంగా హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రి వరకు తీసుకెళ్లాడు. అక్కడి డెప్యూటీ మేనేజర్ వద్ద బస్సును ఆపాడు.వెంటనే స్పందించిన అధికారులు డ్రైవర్‌ను హుజూరాబాద్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవ హరించి, ప్రయాణికుల ప్రాణాలను కాపాడటంతో, పెను ప్రమా దం నుంచి తప్పించుకున్న ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ ధైర్యసాహసాలను పలువురు ప్రశంసిస్తున్నారు.

## ఘనంగా ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

**పాపన్నపేట జూలై 5(పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పుల్లన్న గారి ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం పాపన్నపేట మండల వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. మల్లంపేట గ్రామ శివాలయంలోఅభిషేకం, వివిధ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలో ఆయన అనుచరులు ప్రశాంత్ రెడ్డి పేరు మీద సాంగ్ రిలీజ్ చేశారు. వాహనాలతో భారీ ర్యాలీగా ఏడుపాయల చేరుకొని వన దుర్గ మాత సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.మల్లంపేట, కందిపల్లి యువకులతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# సిగాచి పరిశ్రమ యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి

- సిగాచి ప్రమాదంపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలి
- తక్షణం మృతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం చెల్లించాలి
- యాజమానులకు లాభాలే తప్పా కార్మికుల భద్రత పట్టడం లేదు
- ప్రభుత్వ ఉదాసీనత, యాజమాన్య నిర్లక్ష వైఖరీతోనే ప్రమాదం సంభవించింది
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు

- జిల్లా కలెక్టరేట్ వద్ద సిపిఎం ధర్నా.. సూపరిండెంట్‌కు వినతి పత్రం







**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూలై 05 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు నియోజకవర్గం పాశమైలారం గ్రామ పంచాయతీ పరిధిలోని సిగాచి కెమికల్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలనీ, తక్షణం మృతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం చెల్లించే చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. ఈరోజు బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని,గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు, 50 లక్షల రూపాయలు చెల్లించాలని కోరుతూ సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అధ్యక్షతన జిల్లా కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.అనంతరం కలెక్టరేట్ సూపరిండెంట్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ పరిశ్రమల్లో సౌకర్యాలపై తనిఖీలు నిర్వహించని అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. ప్రమాదానికి కారణమైన పరిశ్రమ యాజమాన్యాన్ని ఇప్పటివరకు అరెస్టు చేయకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. ప్రమాదంలో శాశ్వత వైకల్యం కల్గిన వారికి 50 లక్షలు గాయపడ్డ వారికి 10లక్షల పరిహారం చెల్లించాలని అన్నారు. చికిత్స పొందుతూన్న కార్మికుల్లో కూడా ఇంకా అనేకమంది పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. పారిశ్రామిక ప్రాంతంలో నిత్యం ప్రమాదాలు,కార్మికుల మృత్యువాతలు పడుతున్న ప్రభుత్వ అధికారులు కానీ, పరిశ్రమల యజమాన్యాలు కానీ పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఘటనలు జరిగితేనే అధికారుల పర్యటనలు చేసి తర్వాత గాలికి వదిలేస్తున్నారన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో కంపెనీ యాజమాన్యాలు లాభాలే తప్పా కార్మికుల భద్రత పట్టడం లేదన్నారు.కార్మిక కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. కనీస సౌకర్యాలు లేకుండా నడుస్తున్న కంపెనీలపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. లాభార్జనే ధ్యేయంగా వీళ్ల తీరు ఉందన్నారు. అన్‌స్కిల్డ్ వర్కర్లతో రియాక్టర్ల వద్ద పని చేయించడం సరైంది కాదన్నారు. అన్‌స్కిల్డ్ వర్కర్లతో పని చేయించడం వల్లనే పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నాయ న్నారు. ఘటన జరిగిన నాటి నుండి సీపీఎం బాధితుల పక్షాన నిలుస్తుందన్నారు. ఈరోజు 11 కుటుంబాలకు 5 వేల చొప్పున విరాళాలు అందజేశామన్నారు.సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య,మాణిక్,సాయిలు,నర్సింలు,జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వర్ రావు, విద్యాసాగర్, కృష్ణ, నాయకులు పాండురంగారెడ్డి, నర్సింహారెడ్డి, బాగారెడ్డి, నాగభూషణం, బాలరాజు, విఠల్, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు హజ్రత్ ఇమాం హుస్సేన్ త్యాగం ప్రేరణ కావాలి..

- కరీంనగర్ ఉమ్మడి జిల్లా మజ్లిస్ తహాఫుజ్ ఖత్మె నబువ్వత్ రిలీజియస్ ట్రస్ట్ అధ్యక్షుడు ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మొహియుద్దీన్...



**కరీంనగర్ టౌన్ జూలై 5(పిసిడబ్ల్యూ న్యూస్):** 'మొహర్రం' ఒక ప్రత్యేక ప్రాముఖ్యత కలిగినటువంటి మాసం. ఇస్లామ్ ధర్మంలో దీనికొక ప్రత్యేకత ఉంది. ఇస్లామీ క్యాలండరు ప్రకారం ఇది ముస్లిమ్ జగత్తుకు నూతన సంవత్సరం. ముహర్రం మాసంతోనే ఇస్లామీయ నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. పూర్వచరిత్రలో కూడా దీనికి ప్రత్యేక ప్రాముఖ్యం ఉండింది. ఇస్లామ్ కు పూర్వం అప్పటి సమాజంలో కూడా 'ముహర్రం' నుండే కొత్తసంవత్సరం ప్రారంభమయ్యేది. ముహమ్మద్ ప్రవక్త(స) ముహర్రం మాసాన్ని అల్లాహ్ నెల అని అభివర్ణించారు. రమజాన్ రోజాల (ఉపవాసాలు) తరువాత అత్యంత శుభప్రదమైన రోజా ఆషూరా రోజానే. అంటే ముహర్రం పదవ తేదీన పాటించబడే రోజా అన్నమాట. రమజాన్ రోజులు విధిగా (ఫర్జ్ గా) నిర్ణయించబడక పూర్వం ఆషూరా రోజాయే ఫర్జ్ రోజాగా ఉండేది. కాని రమజాన్ రోజాలు విధిగా నిర్ణయించబడిన తరువాత ఆషూరా రోజా నఫిల్ గా మారిపోయింది. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (ర) ప్రకారం, ఒకసారి ప్రవక్త మహనీయులు మదీనాకు వెళ్ళారు. ఆరోజు అక్కడి యూదులు రోజా పాటిస్తున్నారు. అది ముహర్రం పదవ తేదీ వారిని ప్రవక్త అడిగారు. ఏమిటి ఈరోజు విశేషం?' అని దానికి వారు, ఇది చాలా గొప్పరోజు. ఈ రోజే అల్లాహ్ మూసా ప్రవక్త(అ)ను, ఆయన జాతిని ఫెరౌన్ బారినుండి రక్షించాడు. ఫిరౌన్ ను, అతడి సైన్యాన్ని సముద్రంలో ముంచేశాడు. అప్పుడు మూసా ప్రవక్త, దైవానికి కృతజ్ఞతగా రోజా పాటించారు. కనుక మేము కూడా. ఆయన అనుసరణలో ఈరోజు రోజు పాటిస్తాము' అని చెప్పారు. అప్పుడు ప్రవక్తమహనీయులు, మూసా ప్రవక్త అనుసరణలో రోజా పాటించడానికి మీకంటే మేమే ఎక్కువ హక్కుదారులం అని చెప్పి, తమ అనుచరులకు, రోజా పాటించమని ఉపదేశించారు. ఆషూరా రోజా కేవలం యూదులే కాదు, క్రైస్తవులు కూడా పాటించేవారు. ఈ ఇరువర్గాలూ ముహర్రం పదవ తేదీన మాత్రమే రోజా పాటించేవి. కాని ప్రవక్తవారు, మీరు రెండురోజులు పాటించమని తన సహచరులకు బోధించారు. అంటే ముహర్రం మాసం 9,10 కాని, లేక 10,11 కాని రెండు రోజులు రోజాలను పాటించాలి. కాకతాళీయంగా 'కర్బలా" సంఘటన కూడా ఇదే రోజున జరగడం వల్ల దీని ప్రాముఖ్యత మరింతగా పెరిగిపోయింది. అంత మాత్రాన ముహర్రం మాసమంతా విషాద దినాలుగా పరిగణించడం, ఎలాంటి శు భకార్యాలూ నిర్వహించక పోవడం సరికాదు. ఎందుకంటే సత్యంకోసం, న్యాయం కోసం, ధర్మంకోసం, హక్కులకోసం, ఇస్లామీయ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం హజ్రత్ ఇమామ్ హుసైన్ (ర) అమరగతి పొందారు.ధర్మయుద్ధంలో అమరుడుకావడం మానవ సహజ భావోద్రేకాల పరంగా బాధాకరం కావచ్చునేమోగాని, విషాదం ఎంతమాత్రం కాదు. ముహమ్మద్ ప్రవక్త (స) నిర్యాణం తరువాత తొలి నలుగురు ఖలీఫాలు: సారథ్యంలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ జనరం జకమైన ప్రజాస్వామ్య పాలన పరిఢవిల్లింది. ఇస్లామీయ ప్రజాస్వామ్యంలో మొట్టమొదటి సూత్రం, దేశం దైవానిది, దేశవాసులు ఆయన పాలితులు', అంతేకాని పాలకులు ప్రజలకు ప్రభు వులు ఎంతమాత్రం కాదు. ఇస్లామీయ రాజ్యానికి దైవభీతి, సచ్ఛీలత, జవాబుదారీతనం ప్రాణం లాంటివి. పాలకులు ఈ సుగుణాలకు ప్రతిరూపంగా, ఆదర్శంగా ఉ డేవారు అధికారులు, న్యాయమూర్తులు, సేనాపతులు, అన్నిశాఖల అధికారులు ఎంతో నిజాయితీ పరులుగా, న్యాయ ప్రేమికులుగా ఉండేవారు. అనుక్షణం దైవానికి భయపడుతూ, ప్రజాసేవలో ఎలాంటి లోటు రాకుండా జాగ్రత్తపడేవారు. ప్రజలకు సమాధానం చెప్పుకునే విషయంలో కూడా వారు, 'ఎప్పుడైనా, ఎక్కడైనా తాము ప్రజలకు జవాబుదారులు మని భావించేవారు. ప్రతిరోజూ నమాజుల సమయంలో ప్రజల్ని కలుసుకొని, వారి అవసరాలు తీర్చేవారు. అవసరమైన సూచనలు, హితవులు చేసేవారు. కాని ఖలీఫాల తదనంతర కాలంలో పరిస్థితులు మారిపోయాయి.. దైవభీతి, జవాబుదారీతనం, ప్రజాస్వామ్య భావనలకు భంగం ఏర్పడింది. యజీద్ రాచరికం రూపంలో పురుడు పోసుకున్న దుష్పరిణామాలు ఇస్లామీయ ప్రజాస్వామ్య భావనను, ఆ సూత్రాలను తుంగలో తొక్కాయి. ఈ విధంగా కుటుంబ పాలన, చక్రవర్తుల పరంపర ప్రారంభమైంది. ఈ దురదృష్టకర పరిణామాల కారణంగా ముస్లిం సమాజం నేటి వరకూ ఇస్లామీయ ప్రజాస్వామ్య స్ఫూర్తికి దూరంగానే ఉండిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇస్లామీయ ప్రజాస్వామ్య పరిరక్షణకు హజ్రత్ ఇమామ్ హుసైన్ (ర) కంకణ బద్ధులయ్యారు. లక్ష్యసాధన కోసం ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కోడానికి సిద్ధపడ్డారు. విలువల పరిరక్షణ కోసం ప్రాణత్యాగానికైనా వెనుకాడలేదు. ప్రజాకంటకమైన రాచరిక వ్యవస్థను ఎదుర్కొన్న క్రమంలో సంభవించిన పరిణామ ఫలితాలు ఈనాడు. మనముందున్నాయి. ఇమామ్ హుసైన్ ఇంతటి ప్రమాదాన్ని కూడా లెక్కచేయకుండా వీరోచితంగా పోరాడి, ఇస్లామీయ ప్రజాస్వామ్య సంక్షేమరాజ్యాన్ని, దాని ప్రత్యేకతల్ని కాపాడుకోడానికి 'కర్బలా' సాక్షిగా ఒకవిశ్వాసి పోషించవలసిన పాత్రను ఆచరణాత్మకంగా నిరూపించారు. అందుకే ఆమహనీయుడు అమరుడై దాదాపు వేయిన్నర సంవత్సరాలు కావస్తున్నా, నేటికీ కోట్లాదిమంది ప్రజలకు, ప్రజాస్వామ్య ప్రియులకు ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలుస్తున్నారు. అందుకే ప్రతియేటా 'మొహర్రం' పదవ తేదీన (యౌమె ఆషూరా) ఆయనగారి త్యాగాన్ని స్మరించుకుంటారు. ఈ నేపథ్యంలో చూసినప్పుడు హజ్రత్ ఇమామ్ హుసైన్ (ర) అమరత్వం ఆషామాషీ మరణంకాదు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ, ధర్మసంస్థాపన, దైవప్రసన్నతే ధ్యేయంగా సాగిన సమరంలో పొందిన వీరమరణం. అందుకని ఆయన ఏ లక్ష్యం కోసం, ఏ ధ్యేయం కోసం తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అమరుడయ్యారో మనం దాన్నుండి స్ఫూర్తిని పొందాలి. సమాజంలో ప్రబలినప్పుడు, ఉన్మాదం జడలు విప్పినప్పుడు, విలువల హననం పోరాడి జరుగుతున్నప్పుడు, ప్రజాస్వామ్య వ్యవస్థ బీటలు వారుతున్నప్పుడు సమాజ శ్రేయోభిలాషులు, ప్రజాస్వామ్య ప్రియులు, న్యాయ ప్రేమికులు, పౌరసమాజం తక్షణం స్పందించాలి. న్యాయంకోసం, ధర్మం కోసం, మానవీయ విలువల –కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పరిధిలో శక్తివంచన లేకుండా. పోరాడాలి. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిన ప్రస్తుత తరుణంలో దాన్ని కాపాడుకోడానికి ప్రతి ఒక్కరూ నడుం గించాలి. విలువలప్రేమికులందరూ ఒక్కటిగా ముందుకు కదలాలి. దానికి ఇమామ్ స్ఫూర్తి ప్రేరణ కావాలి. నేడు 10వ ముహర్రం యౌమే ఆషూరా సందర్భంగా ప్రత్యేక వ్యాసమని కరీంనగర్ ఉమ్మడి జిల్లా మజ్లిస్ తహఫుజ్ ఖత్మె నబువ్వత్ రిలీజియస్ ట్రస్ట్ అధ్యక్షుడు ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మొహియుద్దీన్ తెలిపారు.

# డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జీవితం స్ఫూర్తిదాయకం: ప్రిన్సిపల్ బండారి కమలాకర్




**సుల్తానాబాద్, జూలై 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** పెద్దపల్లి జిల్లా శ్రీ వివేకానంద యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో సుల్తానాబాద్ శ్రీవాణి జూనియర్, డిగ్రీ, పీజీ కాలేజీలో ముందస్తుగా డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా విద్యార్థులకు వ్యాసరచన పోటీ, ఉపన్యాస పోటీలు నిర్వహించి ప్రథమ బహుమతి, ద్వితీయ బహుమతులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బాలసాని శ్రీనివాస్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బండారి కమలాకర్, పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ శ్యాంప్రసాద్ ముఖర్జీ ప్రముఖ జాతీయవాద నేతలలో ముఖ్యుడు అని 1951లో భారతీయ జనసంఘ్ పార్టీ స్థాపించిన ముఖర్జీ ఆధునిక హిందుత్వ, హిందూ జాతీయవాదాన్ని ప్రగాఢంగా విశ్వసించడనీ, హిందూ మహాసభ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యుడైన శ్యాం ప్రసాద్ ముఖర్జీ, జనసంఘ్‌ను స్థాపించి దేశంలో తొలి హిందూవాద రాజకీయ పార్టీని స్థాపించిన నేతగా స్థానం పొందినారు అని,కలకత్తా విశ్వవిద్యాలయం కులపతిగా పనిచేసిన అశుతోష్ ముఖర్జీ కుమారుడైన శ్యాంప్రసాద్ ముఖర్జీ కోల్‌కత లోనే ఉన్నత విద్యాభ్యాసం అభ్యసించి ప్రారంభంలో కాంగ్రెసు వాదిగానే రాజకీయ జీవితం ఆరంభించాడు అన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం జవహర్ లాల్ నెహ్రూ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వంలో పరిశ్రమల మంత్రిగా పనిచేశాడనీ, 1949లో ఢిల్లీ ఒప్పందానికి వ్యతిరేకంగా కాంగ్రెసు పార్టీ నుంచి తప్పుకొని 21 అక్టోబరు 1951 న జనసంఘ్ పార్టీని స్థాపించి, ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా 23 మే 1953 న మరణించేవరకు కొనసాగినాడు అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బాలసాని శ్రీనివాస్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బండారి కమలాకర్, కళాశాల అధ్యాపకులు శ్రావణ్, గణేష్, నెహ్రూ యువ కేంద్ర వాలంటరీ రేషవేణి మహేష్, యూత్ సభ్యులు నితిన్, రాకేష్ యూత్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోచమ్మ ఆలయం వద్ద బిజెపి శ్రేణుల స్వచ్ఛభారత్ కార్యక్రమం

● సుల్తానాబాద్ పట్టణ బిజెపి అధ్యక్షులు కూకట్ల నాగరాజు





**సుల్తానాబాద్,జులై5 (పిసిడబ్ల్యూ న్యూస్):** సుల్తానాబాద్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు కూకట్ల నాగరాజు అధ్వర్యంలో రెండవ వార్డ్ పోచమ్మ తల్లి ఆలయం వద్ద తొలి ఏకాదశి పండుగ అలాగే అషాడ మాసం సందర్భముగా పోచమ్మ తల్లి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకోవడం జరుగుతుందని, గుడి పరిసర ప్రాంతం పరిశుభ్రంగా ఉండటం సమాజానికి మంచి మార్గదర్శకంగా ఉంటుందని,పోచమ్మ గుడి పరిసర ప్రాంతాలలో ఉన్న చెత్తను పనికి రాని మొక్కలను తొలగించి శుభ్రం చేసి స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించిన భారతీయ జనతా పార్టీ నాయకులు.ఈ సందర్భముగా బిజెపి అధ్యక్షులు కూకట్ల నాగరాజు మాట్లాడుతూ 80 సంవత్సరాలు చరిత్ర కలిగిన పోచమ్మ తల్లి ఆలయం గత పాలక వర్గం నిర్లక్షముతో నిరాదరణకు నోచుకున్నది అని, భక్తులకు సరైన వసతులు లేక ఆలయం శిధిలావస్థలో ఉండి ఆలయ పై కప్పు కుంగి పోయి కూలి పోయే పరిస్థితిలో ఉన్నది అన్నారు. రాత్రి పూట మందు బాబులకు అడ్డాగా మారిందని, ఆలయానికి సంభందించిన భూమి ఆక్రమణకు గురి అయి వచ్చిన భక్తులకు ఉండడానికి చోటు సరిపోక అసౌకర్యానికి గురి అవుతు న్నారు అని అన్నారు. మాజీ పట్టణ అధ్యక్షులు ఏళ్లంకి రాజన్న, జిల్లా మహిళా మోర్చా నాయకురాలు ఎస్ఎస్సి వనజా, మాటూరి లత, ప్రధాన కార్యదర్శి కందునూరి కుమార్ ఉపాధ్యక్షులు ఎనగందుల సతీష్, గజభింకర్ పవన్, చిట్టవేని సదయ్య, శేకర్ మాస్టర్, బుర్ర సతీష్, శ్రీగిరి సుధాకర్, రామిడి రవీందర్, వేముల శ్రీనివాస్, పోచంపల్లి ఈశ్వర్, కొత్తిరెడ్డి అరవింద్ రెడ్డి, కందునూరి మనోహర్, దేషెట్టి అనిల్, గాదం శివ, గాదాసు విజయ్, పురెళ్ళ అశోక్, అసరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఎండిలో గల జెట్ స్కి స్కూటర్ హైదరాబాదుకు తరలింపును అడ్డుకున్న బిఆర్ఎస్ నగర శాఖ అధ్యక్షులు..



**కరీంనగర్ టౌన్, జూలై 5(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ లోగల లోయర్ మానేరునదిలో బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అప్పటి రాష్ట్ర మంత్రి ప్రస్తుత శాసనసభ్యులు గంగుల కమలాకర్ నేతృత్వంలో.. నగరపాలక సంస్థకు కేటాయించిన సీఎం అస్సూర్యెన్స్ నిధుల ద్వారా కొనుగోలు చేసిన జెట్ స్కి స్కూటర్ ను నేడు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ కు తరలిస్తున్న విషయాన్ని తెలుసుకొని.. బిఆర్ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షులు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో.. లేక్ పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. కరీంనగర్ నగర ప్రజల డబ్బులతో కొనుగోలు చేసిన స్కూటర్ ను వెంటనే తిరిగి తీసుకురావాలంటూ నినాదాలు చేశారు.. జై కేసీఆర్ జై గంగుల జై వినోద్ అంటూ నినాధాలు చేశారు. ధర్నా విషయం తెలుసుకున్న పర్యాటకశాఖ అధికారులు తిరిగి జెట్ కి స్కూటర్ను మానేరు నదిలో యధాస్థానానికి చేర్చారు. ఈ సందర్భంగా నగర బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చల్ల హరిశంకర్ మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో.. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్ కరీంనగర్ పై ప్రత్యేక దృష్టితో,.. కరీంనగర్ పట్టణాన్ని అభివృద్ధిలో హైదరాబాద్ తర్వాత రెండో స్థానంగా ఉంచేందుకు వందల కోట్ల రూపాయలను తీసుకువచ్చి అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అందులోనే భాగంగా 24 టీఎంసీల నీటి నిలువ సామర్థ్యం గల లోయర్ మానేరు నది యందు పర్యాటక రంగంగా అభివృద్ధి చేసెందుకు మానేరు నదిలో రెండు జెట్స్ కి స్కూటర్లను, క్రూకఈజ్ బోట్ ను కొనుగోలు చేసి. కాలేశ్వరం జలాలతో మానేరు నదిలో ఎప్పుడూ 20 టీఎంసీలు తగ్గకుండా నీరు నిల్వ ఉంచి.. పర్యాటకులకు ఆహ్లాదకరంగా ఉండేందుకు బోట్లను నడిపిన విషయాన్ని గుర్తు చేశారు. ఒకప్పుడు మానేరు నది వద్ద పర్యాటకులతో కలకలలాడేదని.. ఇటు మానేరు నది తో పాటు దక్షిణ భారతదేశంలోనే కరీంనగర్ నగరం ఒక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందాలనే సంకల్పంతో మానేరు రివర్ ఫ్రంట్ లాంటి ఒక గొప్ప ప్రాజెక్టును అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ ను ఒప్పించి.. కరీంనగర్ కు తీసుకువచ్చిన ఘనత మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాజీ ఎంపీ బోయిన్పల్లి వినోద్ కుమార్ కే దక్కుతుందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడదిన్నర కాలంలో.. కలకలాడిన మానేరు నది వెలవెలబోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓవైపు మానేరివర్ ఫ్రంట్ పనులు ఆపేశారని.. ఎల్ఎండిలో నీటి నిలువ డెడ్ స్టోరేజ్ కి పడిపోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇటు ఎల్ఎండిలో నీళ్లు నింపడంతో పాటు.. పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. దాంతోపాటు రివర్ ఫ్రంట్ పనులు కూడా పూర్తి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కరీంనగర్ ప్రజల కు సంబంధించిన ఏ ఆస్తిని తరలించాలని చూసిన బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అడ్డుకుంటు ందని హెచ్చరించారు. మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కాలేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని నీటితో సస్య శ్యామలం చేసిన అపర భగీరథుడు కేసీఆర్ అని.. ఆయన బాటలోనే నడుస్తూ కరీంనగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన గొప్ప నాయకుడు గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్లో గంగుల కమలాకర్ చేసిన అభివృద్ధిని గంగుల కమలాకర్ పేరును కనుమరుగు చేసే దిశగా.. కాంగ్రెస్ నాయకులు కుట్ర పన్నుతున్నారని.. అందులో భాగంగానే నేడు దొంగతనంగా ఎల్ఎండి లో ఉన్నటువంటి స్కూటర్ను హైదరాబాద్ కు తరలించే ప్రక్రియ చేపట్టారని విమర్శించారు. గంగుల కమలాకర్ చేసిన అభివృద్ధిని కానీ.. వారి ఆనవాళ్లను కానీ తుడిచేస్తామంటే ఊరుకునే ప్రసక్తే లేదని.. కరీంనగర్ ప్రజల డబ్బులు ద్వారా కొనుగోలు చేసిన జెట్ కి స్కూటర్ను తిరిగి తెప్పించడమే ఇందుకు నిదర్శనం అన్నారు. కరీంనగర్ ప్రజల ఆస్థి కాపాడుకోవడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని హెచ్చరించారు. నగర బీఆర్ఎస్ అధ్యక్షులు చల్ల హరిశంకర్ తో పాటు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు దిండిగాల మహేష్,ఏవి రమణ, మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్, మైనార్టీ శాఖ అధ్యక్షులు మీర్ షౌకత్ అలీ, ప్రధాన కార్యదర్శి వాజిద్ హుస్సేన్,పార్టీ డివిజన్ అధ్యక్షులు చేతి చంద్రశేఖర్,ఆరే రవి, జల్లోజి శ్రీనివాస్, నారదాసు వసంతరావు, నదీమ్, ఒడ్నాల రాజు, పటేల్ సుధీర్ రెడ్డి,కొత్త అనిల్ కుమార్, బి ఆర్ ఎస్ వి నాయకులు చుక్క శ్రీనివాస్, నరేష్ రెడ్డి, నాయకులు ధీరజ్, ఉమాశంకర్, పలువురు బిఆర్ఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల జీవితాల్లో వెలుగు నింపడమే ప్రధాన లక్ష్యం

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు





**చిట్యాల, జులై 5 (పీసీడబ్ల్యు న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాల్లో సీఎంఆర్ఎఫ్‌సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలవడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. సీఎం సహాయనిధి ద్వారా పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు.మానవతాదృక్పథంతో సీఎం రేవంత్ రెడ్డి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు.మండల కేంద్రంలోని డీసీసీబీ బ్యాంకు ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలను నాటారు. అనంతరం నీరు పోశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మండల నాయకులు కార్యకర్తలు.ప్రజలు పాల్గొన్నారు

# హుజూరాబాద్‌లో మానవత్వం

● స్నేహితురాలి పిల్లల భవిష్యత్‌కు అండగా నిలిచిన పూర్వ విద్యార్థులు






**హుజూరాబాద్,జులై 5 (పీసీడబ్ల్యు న్యూస్):** మానవ సంబంధాలు, స్నేహానికి ప్రతీకగా నిలిచింది హుజూరాబాద్ పట్టణం. ఇటీవల అనారోగ్యంతో అకాల మరణం చెందిన బుర్ర కవిత అనే యువతి కుటుంబానికి, ముఖ్యంగా ఆమె బిడ్డలకు అండగా నిలవడానికి ఆమె చిన్ననాటి స్నేహితులు ముందుకు వచ్చి తమ ఔదార్యాన్ని చాటుకు న్నారు. స్నేహితుల ఈ సహాయం బాధిత కుటుంబానికి గొప్ప ఊరటనిచ్చింది. హుజూరాబాద్‌లోని కాకతీయ కాలనీకి చెందిన బుర్ర కవిత అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమె మరణం కుటుంబానికి తీరని విషాదాన్ని మిగిల్చింది. కవిత లేని లోటును భర్తీ చేయలేకపోయినా, ఆమె పిల్లల భవిష్యత్తుకు ఆర్థికంగా అండగా నిలవాలని కవిత స్నేహితులు సంకల్పించారు. కవిత పిల్లల భవిష్యత్, విద్యా అవసరాల కోసం ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించుకున్నారు. విశ్వప్రగతి విద్యాలయానికి చెందిన 1998-1999 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు, కాకతీయ జూనియర్ కళాశాలకు చెందిన 1999-2001 బ్యాచ్ విద్యార్థులు, మరియు శాతవాహన డిగ్రీ కళాశాల 2001-04 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులంతా ఏకమై ఈ మంచి పనికి శ్రీకారం చుట్టారు. ఈ బృందాలన్నీ కలిసి రూ. 2 లక్షల రూపాయల భారీ మొత్తాన్ని సేకరించారు. ఈ మొత్తాన్ని కవిత కూతురు సుప్రీతి భవిష్యత్ అవసరాల కోసం బ్యాంకులో స్థిర నిధి (ఫిక్స్‌డ్ డిపాజిట్) చేశారు.శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో, ఈ ఫిక్స్‌డ్ డిపాజిట్‌కు సంబంధించిన ధృవపత్రాలను స్నేహితులు సుప్రీతికి అందజేశారు. కళ్యాణ్, శ్రీనివాస్, రాజు, అశోక్, శ్రీశైలం, సత్యం, గోవర్ధన్, సంజయ్, రాజు, వనిత, స్వప్న, నర్మద, వెంకటేష్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు. తమ బిడ్డ భవిష్యత్తుకు అండగా నిలిచిన స్నేహితులకు బాధిత కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంఘటన స్నేహం విలువను, సాటి మనుషుల పట్ల మానవత్వాన్ని చాటి చెప్పింది.

# బిఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి వచ్చి చూపిస్తా చామల

● అందరికీ ఉన్నదే మీకు ఉంది కల్లూరు



**యాదాద్రి జులై 5 (పీసీడబ్ల్యు న్యూస్):** భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మీరు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి వచ్చి చూపిస్తా చూపిస్తా అని అంటున్నారు మీరు ఏం చూపిస్తారు అందరికి ఉన్నదే మీకు ఉంది కదా! మీకు ఏమైనా ఎక్కువ ఉంటే చూపిస్తా అంటే చూడడానికి మాకు ఆత్రుతగానే ఉంది. మీకు చూపించాలని ఉంటే ఎస్ఎల్బీసిలో కూలిన శిథిలాల కింద ఇంకా తీయని శవాలను బయటకు తీసి చూపించండి.మీ ప్రభుత్వం అసమర్థత వల్ల శిథిలాల కింద చనిపోయిన మృతుల కుటుంబాలు కడసారి చూపు కూడా నోచుకోలేదు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గంలో టిఆర్ఎస్ హయాంలో ఏర్పాటు చేసిన ఎయిమ్స్ ఆసుపత్రిలో సంపూర్ణంగా అన్ని విభాగాలకు సంబంధించి ఇన్ పేషెంట్ సేవలు ప్రారంభించి మీ దమ్మేంటో చూపించండి. చామల కిరణ్ కుమార్ రెడ్డి మీరు పార్లమెంటు సభ్యునిగా గెలిచి 14 నెలలు కావస్తుంది. ఈ 14 నెలల కాలంలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో మీరు చేసిన అభివృద్ధి ఏంటో చూపించండి. లాగులు పగలగొడతా,లాగులో తొండలు వదులుతా, బట్టలూడదీస్తా, పేగులు బయటకు తీస్తా ఈ భాష ఎవరిదో..? ఈ భాషకు యజమాని ఎవరో తెలంగాణ ప్రజలందరికీ తెలుసు.ఆ భాష వాడిన యజమాని దగ్గరికి వెళ్లి నువ్వు చూపించాల్సింది ఏంటో ఇప్పి చూపించు. ఆ యజమాని తరిస్తడు. మీకు ఏదో ఒక కానుక ఇస్తాడు.బీఆర్ఎస్ పై పనికిమాలిన విమర్శలు చేస్తే సహించేది లేదు అంటున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి.



# కన్నడ భాషపై మాట్లాడొద్దు..

## కమల్ హాసన్‌ను ఆదేశించిన కోర్టు

ప్రముఖ సినీ నటుడు, లోకనాయకుడు కమల్ హాసన్‌కు బెంగళూరు సివిల్ కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కన్నడ భాష లేదా సంస్కృతి గౌరవానికి భంగం కలిగించేలా ఇకపై ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని ఆయన్ను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

గత నెలలో తన 'థగ్ లైఫ్' సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా కమల్ హాసన్ మాట్లాడుతూ "కన్నడ భాష తమిళం నుంచే పుట్టింది" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు కర్ణాటకలో తీవ్ర దుమారాన్ని రేపాయి. పలు కన్నడ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. కమల్ క్షమాపణ చెప్పడానికి నిరాకరించడంతో వివాదం మరింత ముదిరి, కర్ణాటకలో 'థగ్ లైఫ్' సినిమా విడుదల కూడా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మహేశ్ పూరాలా.. కమల్ వ్యాఖ్యలపై బెంగళూరు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన అడిషనల్ సిటీ సివిల్ అండ్ సెషన్స్ జడ్జి ఎన్.ఆర్. మధు.. కన్నడ భాష, సాహిత్యం, భూమి, సంస్కృతికి వ్యతిరేకంగా ఎలాంటి ప్రకటనలు చేయకుండా కమల్‌పై ఆంక్షలు విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అంతేగాక ఆగస్టు 30న జరగనున్న తదుపరి విచారణకు కమల్‌ను వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశిస్తూ సమన్లు కూడా జారీ చేశారు

# వెంకీ సినిమాలో ఛాన్స్ కొట్టేసిన నిధి ?



ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం మూవీతో బ్లాక్ బస్టర్ ను అందుకున్న వెంకటేష్ తన తర్వాతి సినిమాల విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సంక్రాంతి వస్తున్నాం సినిమాతో వచ్చిన సక్సెస్ ను కాపాడుకోవాలని ఏ కథ పడితే అది కాకుండా మంచి స్క్రిప్ట్ తో సినిమా చేయాలని చూస్తున్నారు విక్టరీ వెంకటేష్. వెంకీ తన తర్వాతి సినిమాను ఎవరితో చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకీ ఓ సినిమాను చేయబోతున్నట్టు ఇప్పటికే వార్తలొస్తున్న సంగతి తెలిసిందే. వీరి కాంబినేషన్ లో రానున్న సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటనైతే రాలేదు కానీ ఆల్రెడీ ఈ సినిమాకు సంబంధించిన వర్క్స్ వేగంగా జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే త్రివిక్రమ్ సినిమాకు కథను లాక్ చేసి ప్రీ ప్రొడక్షన్ వర్క్ కూడా పూర్తి చేశారని అంటున్నారు. ఈ సినిమాకు వెంకట రమణ కేరాఫ్ ఆనంద నిలయం అనే టైటిల్ ను అనుకుంటున్నారని కూడా వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో వెంకీ నటించిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి సినిమాలకు త్రివిక్రమ్ రైటర్ గా పని చేయగా ఆ రెండు సినిమాలూ మంచి హిట్లుగా నిలిచాయి. కానీ త్రివిక్రమ్ డైరెక్టర్ గా మారాక మాత్రం వీరిద్దరూ కలిసి పని చేసింది లేదు. ఇన్నేళ్లకు వీరిద్దరి కాంబోలో సినిమా రానుండటంతో ఈ కాంబినేషన్ పై అందరికీ భారీ అంచనాలున్నాయి. అయితే ఈ సినిమాకు సంబంధించి ఓ క్రేజీ న్యూస్ ఫిల్మ్ న్యూస్ సర్కిల్స్ లో వినిపిస్తోంది. వెంకీ- త్రివిక్రమ్ కాంబినేషన్ లో రానున్న సినిమాలో ఇద్దరు హీరోయిన్లు నటించనుండగా, అందులో ఇస్మార్ట్ బ్యూటీ నిధి అగర్వాల్ ఒక హీరోయిన్ గా ఫిక్స్ అయినట్టు సమాచారం. త్వరలో సినిమాను మొదలుపెట్టి 2026 సమ్మర్ కు రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. వెంకీ కెరీర్లో 77వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఎప్పుడొచ్చినా ఆడియన్స్ అంచనాలకు తగ్గట్టే ఉంటుందని భావిస్తున్నారు. కాగా నిధి అగర్వాల్ ప్రస్తుతం హరి హర వీరమల్లు, ది రాజా సాబ్ సినిమాల్లో నటిస్తున్న సంగతి తెలిసిందే.

# తెలుగు రాకపోయినా ఆ సినిమా 50 సార్లు చూశా



సపోర్టింగ్ రోల్స్ తో కెరీర్ ను స్టార్ట్ చేసిన వర్ష బొల్లమ్మ ఇప్పుడు టాలీవుడ్ లో క్రేజీ హీరోయిన్ గా మారారు. మిడిల్ క్లాస్ మెలోడీస్, ఊరి పేరు భైరవకోన, స్వాతి ముత్యం లాంటి సినిమాలతో తెలుగు ఆడియన్స్ కు బాగా దగ్గరయ్యారు వర్ష బొల్లమ్మ. ఇప్పుడు తమ్ముడు సినిమాతో మరోసారి ప్రేక్షకుల ముందుకొచ్చిన వర్ష ఈ సినిమాలో ఓ హీరోయిన్ గా నటించారు. తమ్ముడు మూవీలో సప్తమి గౌడ మెయిన్ హీరోయిన్ గా నటించగా, వర్ష బొల్లమ్మ మరో ఫీమేల్ లీడ్ గా నటించారు. శుక్రవారం తమ్ముడు సినిమా రిలీజవగా, ఈ సినిమాలో వర్ష యాక్టింగ్ కు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. తమ్ముడు సినిమా ప్రమోషన్స్ లో యాక్టివ్ గా పాల్గొన్న వర్ష బొల్లమ్మ పలు ఇంట్రెస్టింగ్ విషయాలను ఆడియన్స్ తో షేర్ చేసుకున్నారు. ఈ ప్రమోషన్స్ లో వర్ష బొల్లమ్మ తన వ్యక్తిగత విషయాలతో పాటూ ఆమె ఇష్టాలను కూడా బయటపెట్టారు. తాను రవితేజ విక్రమార్కుడు సినిమాను 50 సార్లు చూశానని, సమ్మర్ హాలిడేస్ లో తాను 50 రోజులు తన కజిన్ వాళ్ల ఇంటికి వెళ్లగా అక్కడ తన కజిన్ సిస్టర్ ప్రతీ రోజూ విక్రమార్కుడు సినిమా చూసేదని, తన కజిన్ వల్ల తాను కూడా విక్రమార్కుడు సినిమాను చూడాల్సి వచ్చిందని వర్ష బొల్లమ్మ తెలిపారు. అప్పట్లో డీవీడీలు ఉండటంతో క్యాసెట్ వేసుకుని దాదాపు తాను ఉన్నన్ని రోజులు తన కజిన్ ఒకే సినిమాను చూసిందని, విక్రమార్కుడు లోని సాంగ్స్ అంటే తన కజిన్ కు ఎంతో ఇష్టమని, పాటల కోసం ప్రతీ రోజూ సినిమా మొత్తాన్ని చూసేదని, ఒకవేళ సినిమా వేయకపోతే ఆ రోజు ఆమెకు చాలా కోపం వచ్చేదని, దీంతో చేసేదేమీ లేక తాను కూడా విక్రమార్కుడు సినిమాను చూశానని వర్ష తెలిపింది. అయితే ఆ సినిమా చూసేటప్పుడు తనకు ఎక్కువగా తెలుగు రాదని, కానీ ఆ సినిమాలోని డైలాగ్స్ మొత్తం తనకు గుర్తున్నాయని, తెలుగు రాకపోయినా రెండు మూడు సార్లు చూశాక విక్రమార్కుడు సినిమా చాలా అద్భుతంగా అనిపించిందని ఆ రోజులను గుర్తు చేసుకున్నారు వర్ష బొల్లమ్మ.

# సెప్టెంబర్‌లో సెట్స్‌పైకి 'స్పిరిట్'



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుసబెట్టి సినిమాలు చేస్తున్నాడు. 'ది రాజా సాబ్' చిత్ర షూటింగ్ చివరి దశలో ఉండగా హను రాఘవపూడితో 'ఫౌజీ' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ రెండు చిత్రాలు కూడా వేర్వేరు జోనర్లలో తెరకెక్కుతుండటంతో అభిమానులు ఈ సినిమాల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక ఈ సినిమాల తర్వాత ప్రభాస్ నెక్స్ట్ చిత్రం దర్శకుడు సందీప్ రెడ్డి వంగాతో చేయనున్నాడు.'స్పిరిట్' అనే టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సినిమాలో ప్రభాస్ ఓ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తాడు. అయితే, ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ నెలలో పట్టాలెక్కించేందుకు చిత్ర యూనిట్ ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఈ వార్తతో అభిమానులు ఈ సినిమా ఎప్పుడెప్పుడు పట్టాలెక్కుతోందా.. ఎప్పుడెప్పుడు ఈ సినిమా నుంచి వరుస అప్డేట్స్ వస్తాయా అని మరింత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# రేపిస్టులు ఎంపీలు అవుతుంటే లేని బాధ, రణ్‌బీర్‌పై ఎందుకు?: గాయని చిన్మయి



ప్రముఖ గాయని చిన్మయి శ్రీపాద సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. 'రామాయణం' చిత్రంలో శ్రీరాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ నటించడంపై ఓ నెటిజన్ అభ్యంతరం వ్యక్తం చేయగా, అత్యాచారాలకు పాల్పడిన వారు ఎన్నికల్లో గెలుస్తున్నప్పుడు లేని బాధ, ఓ నటుడి ఆహారపు అలవాట్లపై ఎందుకంటూ ఆమె ఘాటుగా ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో కొత్త దుమారం రేగింది.వివరాల్లోకి వెళితే.. 'బీఫ్ తినే రణ్‌బీర్ రాముడి పాత్ర పోషించడమేంటి? మన కర్మ!' అని ఓ సోషల్ మీడియా యూజర్ పోస్ట్ చేశారు. దీనిపై స్పందించిన చిన్మయి, "దేవుడి పేరుతో ఓ బాబాజీ రేప్ చేస్తాడు... జైల్లో నుంచి బయటకు వచ్చి ఎన్నికల్లో ఓట్లు కూడా సంపాదించి గెలవొచ్చు... ఇదే భక్త్ ఇండియా. అలాంటప్పుడు ఎవరో ఏదో తిన్నారంటే అదేం పెద్ద సమస్య కాదు కదా?" అంటూ బదులిచ్చారు.

చిన్మయి వ్యాఖ్యలపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. కొందరు ఆమెకు మద్దతు పలకగా, మరికొందరు విమర్శించారు. 'ఒక చెడ్డ పనిని మరోదానితో ఎలా పోలుస్తారు?' అని ఓ వ్యక్తి ప్రశ్నించగా, "రేపిస్ట్ ఎంపీగా గెలిస్తే మీకు ఏమీ అనిపించదు. కానీ బీఫ్ తినే వ్యక్తి రాముడి పాత్ర పోషిస్తే మాత్రం గుండెల్లో మంట. ఈ విషయంలో మీకేం అనిపించట్లేదా?" అని ఆమె ఎదురు ప్రశ్నించారు. తనను విమర్శించిన మరికొందరికి కూడా చిన్మయి తనదైన శైలిలో సమాధానాలు ఇచ్చారు.కాగా, నితీశ్ తివారీ దర్శకత్వంలో భారీ బడ్జెట్‌తో 'రామాయణం' చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో రణ్‌బీర్ కపూర్ రాముడిగా నటిస్తుండగా, హన్స్ జిమ్మర్, ఏఆర్ రెహమాన్ వంటి దిగ్గజాలు సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2025 దీపావళికి విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

# పెద్ది కోసం బుచ్చిబాబు నెక్స్ట్ లెవెల్ ప్లాన్..



ఇండస్ట్రీలో కొన్ని సినిమాల ఫలితాలు తర్వాత రాబోయే సినిమాలపై ప్రభావం చూపుతాయనే సంగతి తెలిసిందే. రీసెంట్ గా కమల్ హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన థగ్ లైఫ్ సినిమా ఎఫెక్ట్ రామ్ చరణ్ సినిమా పెద్ది విషయంలో కూడా ఉంది. దానికి కారణం ఈ రెండు సినిమాలకూ మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్ కావడం. థగ్ లైఫ్ సినిమా డిజాస్టర్ లో రెహమాన్ పాత్ర కూడా ఉంది. ఆ సినిమాకు రెహమాన్ తన మార్క్ మ్యూజిక్ ఇవ్వడంలో విఫలమయ్యారు. దీంతో రెహమాన్ తమ హీరోతో చేస్తున్న పెద్ది సినిమాకు ఎలాంటి మ్యూజిక్ ఇస్తారోనని చరణ్ ఫ్యాన్స్ తెగ టెన్షన్ పడుతున్నారు. మణిరత్నం లాంటి తలలు పండిన డైరెక్టర్‌కే రెహమాన్ థగ్‌లైఫ్ లాంటి ఆల్బమ్ ఇస్తే, కేవలం ఉప్పెన అనుభవం మాత్రమే ఉన్న బుచ్చిబాబుకు ఎలాంటి మ్యూజిక్ ఇస్తారో అని కంగారు పడుతున్నారు. అయితే బుచ్చిబాబును అంత తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. ఉప్పెన సినిమా చేస్తున్నప్పుడు దేవీ శ్రీ ప్రసాద్ నుంచి ఛార్ట్‌బస్టర్ ఆల్బమ్ ను తీసుకున్న బుచ్చిబాబు ఇప్పుడు పెద్దికి కూడా అలాంటి ప్లానే వేశారట. పెద్ది సినిమాలో సాంగ్స్ కోసం బుచ్చిబాబు, రెహమాన్ కు ఒక్కో సాంగ్ కు మూడు రిఫరెన్సులు ఇచ్చి వాటిని బేస్ చేసుకుని తన సినిమాకు ది బెస్ట్ ఇవ్వమని కోరారట. అయితే బుచ్చిబాబు రిఫరెన్సులుగా ఇచ్చిన పాటల్లో ఎక్కువ శాతం ఒకప్పుడు రెహమాన్ ఇచ్చిన ఛార్ట్ బస్టర్ సాంగ్స్ ఉండటం విశేషం. ఇవన్నీ చూసి బుచ్చిబాబు కు మ్యూజిక్ పై ఎంత పట్టుందో తనకు అర్థమైందని రెహమాన్ తన డైరెక్టర్ గురించి రీసెంట్ గా ఓ సందర్భంలో ఎలివేషన్లు ఇస్తున్నారు. వాస్తవానికి థగ్ లైఫ్ సినిమాలో గొప్ప మ్యూజిక్ చేసేంత కథ కూడా లేదు. అయితే థగ్ లైఫ్ సినిమా డిజాస్టర్ తర్వాత ఉన్న అంచనాలను పెద్ది టీజర్ తోనే రెహమాన్ చాలా వరకు క్లియర్ చేశారు. గేమ్ ఛేంజర్ తో డిజాస్టర్ అందుకున్న చరణ్ ఫ్యాన్స్ కు పెద్ది మూవీకి సంబంధించిన ప్రతీ విషయంలోనూ కంగారు ఉండటం సహజం. కానీ రెహమాన్ మాటలు వింటుంటే బుచ్చిబాబు పెద్ది విషయంలో తాను అనుకున్న అవుట్‌పుట్ వచ్చే వరకు ఎవరినీ అంత ఈజీగా వదిలేలా కనిపించడం లేదు. ప్రస్తుతం పెద్ది షూటింగ్ నిర్విరామంగా జరుగుతుంది. ఈ నెలలోనే సాంగ్స్ షూట్ కు వెళ్లనున్నట్టు తెలుస్తోంది. వచ్చే ఏడాది మార్చి 27న పెద్ది సినిమా రిలీజవనుండగా, ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తున్నారు.